వేములవాడ

శ్రీ రాజరాజేశ్వర శతకము

APR 2002
...-Andhra Pradesh, Hyderabad
ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్
Acc. No. 28195
2498
ROL

రసప్రియ

కేశవాచార్య

తిరుమల తిరుపతి దేవస్థానమువారి ఆర్థిక సహాయముతో

ముద్రింపబడినది.

భోజ ప్రచురణలు—5

సర్వస్వామ్యములు
ర చ యి త వి.

This Book is published with the **Financial Assistance** of **Tirumala Tirupati Devastanams** under their scheme "Aid to publish Religious Books"

వెల రు. **2-00**

మ హా శి వ రా త్రి
11-2-1983
ప్రతులు: 1000

ము ద్ర ణ
ప్ర తు ల కు
వై. వి. ప్రెస్, ఖమ్మం.



శ్రీ కేశవాచార్య దంపతులు (1972లో)

అభినందనాశీర్వాదములు.

ఆచార్య డా॥ దివాకర్ల వేంకటావధాని
ఎం. ఎ., పి. హెచ్. డి.
రిటైర్డు ఆంధ్ర శాఖాధ్యక్షులు
ఉస్మానియా విశ్వ విద్యాలయం. (ఆం. ప్ర.)

'రసప్రియ' సార్ధక బిరుదాంకితులైన శ్రీ కేశవాచార్య కవిగారు రచించిన శ్రీరాజరాజేశ్వర శతకము నందలి పద్యము లందందు చదివి యానందించితిని. ఇందలి ప్రతి పద్యమును శ్రీ కవిగారికి శ్రీరాజరాజేశ్వర దేవునిపైగల యపారమునైన భక్తి విశ్వాసములను బ్రకటించుచున్నది. కొన్ని పద్యము లుపమాలంకారములతోఁగూడి సరసములై పూర్వ కవుల శతక పద్యములను దలపించుచున్నవి. అంతమునందలి కొన్ని పద్యములలో శ్రీ కవిగారిప్పటి సంఘమందలి పరిస్థితులను జక్కగా వర్ణించియున్నారు. ఇందలి రచన ధారాళమై లలిత పదప్రయోగ శోభితమై, భక్తినిధానమై, నిర్దుష్టమై చదివినకొలంది చదువవలెనను నుత్కంఠను రేకెత్తించుచున్నది. రసప్రియు లైన కవిగారు సరసములు, సర్వజనాదర పాత్రములు, భావ గంభీరములునైన రచనలితోధికముగా గావించి యాంధ్ర భాషా యోషకపూర్వాలంకృతులు సంధింతురని యాశించుచున్నాను.

హైదరాబాద్,
ది. 26-1-1970

దివాకర్ల వేంకటావధాని

శ్రీ గడియారం రామకృష్ణశర్మ
కార్యదర్శి: ఆంధ్ర సారస్వత పరిషత్తు
హైద్రాబాద్.

రసప్రియులు శ్రీ కేశవాచార్య కవిగారు ఆంగ్ల విద్యా పట్టభద్రులు ఆర్థిక గణాంక శాఖలో నుద్యోగులు. అయినను బాల్యమునుండి వీరు ఆంధ్రసాహిత్యాభిరుచిగలవారు. వీరి కవితా లత పూచిన తొలి పూవు కీసర క్షేత్రస్వామి శ్రీ రామలింగేశ్వరునకు సమర్పితమైనది. ద్వితీయ కుసుమము శ్రీ వేములవాడ రాజరాజేశ్వరున కంకితమగు భాగ్యమునకు నోచికొన్నది, వీరికీ రచనలలో ముఖ్యముగా భక్తియే ప్రేరకమై నిర్వహించినది. పాఠకులు కవిగారి భక్త్యావేశ భావ వీచికలలో విహరించి రసానుభూతిని పొందగలరనుటలో సందేహములేదు. కొన్ని పద్దెములు ముద్దులు మూటగట్టునట్లున్నవి. సాధారణముగా అన్ని శతకము లందు వలెనే ఇందును వివిధ విషయములు స్పృశింపబడి రచయితకు గల లోకజ్ఞానమును వెల్లడించుచున్నవి.

అలతి పదములతో, ఉదాత్త భావములతో నొప్పుచున్న ఈ కృతి క్షేత్రపాలకున కర్పితమై భగవత్ప్రసాద మైనది. శ్రీరాజరాజేశ్వరు ననుగ్రహమున కృతికర్త ఆయురారోగ్య భాగ్యములంది ఆంధ్ర భారతికి ఇతోధిక సేవచేయగలరని ఆశించుచున్నాను.

భాగ్యనగర్,
ది. 23-12-1969

గడియారం రామకృష్ణశర్మ

కళాప్రపూర్ణ
డాక్టర్ దాశరథి, డి.లిట్.
ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి

గుండె గుడిలో రాజరాజేశ్వరుడు

"రస ప్రియ" అనే కలం పేరుతో సుప్రసిద్ధులైన శ్రీ కేశవాచార్యులవారు తమ శ్రీ రాజరాజేశ్వర శతకమును పునర్ముద్రించగలగడం దైవానుగ్రహమే. సందేహంలేదు.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు ధన సహాయంచేయుట, శ్రీ రాజరాజేశ్వరస్వామి, కవిగారి స్వప్నంలో సాక్షాత్కరించి ఈ శతకాన్ని పునర్ముద్రణ జరుపమని ఆదేశించుట ఆనందదాయకములైన సంఘటనలు.

"శ్రీమద్వేములవాడ మందిరవరా! శ్రీ రాజరాజేశ్వరా!" వేములవాడ పుణ్యక్షేత్రంలో వేంచేసియున్న స్వామి వారి పై శతకం చెప్పి రసప్రియ గారు కృతార్థులైనారు.

వారి ఇతర గ్రంథాలు చదివియున్నవాణ్ణి గనుక రసప్రియ గారి కవితా మనోహరతను చవిచూచినవాణ్ణి. ఆయనది అపారమైన ధార. భక్తిపారవశ్యంలో, శార్దూలమత్తేభాలు, ఆయనవద్ద పిల్లులవలె మెలగును.

"నీ సంకల్పములేక వెల్వడదుగా నిక్కంబుగా నేదియున్?" అన్నారు కవిగారు ఒకచోట. ఆ సంకల్ప బలంతోనే

'రసప్రియ' కలంనుండి పుంఖాను పుంఖంగా కవితలు వెలువడుతున్నాయి. నాకు నచ్చిన శతకాలలో శ్రీ రాజరాజేశ్వర శతక మొకటి. శతక రచనకు తెలుగు కవులదే అగ్రతాంబూలం. ఈ సంప్రదాయాన్ని రసప్రియగారు నిలబెట్టారు.

ఈ శతకంలో వేములవాడ మహాక్షేత్ర మహాత్మ్యమును గూర్చి వివరంగా వ్రాశారు కవిగారు. సుదూర ప్రాంతాలలోని పాఠకులకు వేములవాడ విశేషం ఈ ఉపోద్ఘాతంవల్ల బాగా అవగతమవుతుంది.

"గుడిలో నుందువా? లేక గుండెగుడిలో
గూర్చుందువో!" అన్నారు కవిగారు.

గుండెగుడియే వాస్తవమైన గుడి.
సర్వలోక నిలయుడు అంతటనున్నాడుకదా!

రసప్రియగారు రసావేశంతో ఈ శతకం రచించారు. కవికి కావలసింది రసావేశమే. అదిలేనినాడు కవిత పేలవం అయిపోతుంది. రసావేశపరులైన 'రసప్రియ' సహజకవి.

ఈ శతకాన్ని పాఠకులు పఠించి ఆనందిస్తారని దృఢంగా విశ్వసిస్తున్నాను.

దుందుభి రథసప్తమి,
హైదరాబాదు.

—దాశరథి

త్ర్యర్థి కావ్య నిర్మాత
మహాకవిశేఖర, శతావధాని, కవి సింహ
పోకూరి కాశీపత్యవధానులు
మాజీ గద్వాల రాజాస్థాన కవి
నాగార్జున సాహితీ సమాఖ్యాధ్యక్షుడు.
మాచర్ల.

శ్రీశ్రీ కేశవాచార్య కవి ప్రణీతంబైన శ్రీరాజరాజేశ్వర శతకమును స్థాలీపులాక న్యాయముగా పారజూచితిని. ఇందు భక్తజనాగ్రగణ్యులకును, నైతిక కాంక్షులకును, సాంఘికా వ్యవస్థాలోకనులకును నత్యంతోపయుక్తములగు పద్యము లెన్నియో కలవు. ఇవి రసప్రయుక్తములుగను, శ్రావ్యములుగను, మృదు మధుర పదభూయిష్టములుగను, భావ బంధురములుగను సలక్షణంబులునై కవితా కౌశలమును బ్రకటించుచు హృదయంగమములై పాఠక లోకమునకు మహదానందము నిచ్చుచున్నవి. శ్రీ కవిగారు అనర్గళ కవితాధార భావపటిమ గలవారు. కావున నిట్టి గ్రంధరాజములను బ్రకటించి సాహిత్య లోకమునకుపకృతి గావించుటకు నీ కవికి నాయురారోగ్యైశ్వర్యము లొసంగి పోషించుగాతమని పరమేశ్వరుని ధ్యానింపుచున్నాడను.

మాచర్ల,
ది. 6-11-1970

ఇట్లు.
పోకూరి కాశీపత్యవధానులు

ప్రసన్న భారత వ్యాస
కవిజనారాధ్య, సాహిత్యస్థాపక, కవివీర
వాజపేయయాజుల రామసుబ్బారాయుఁడు, B. A.
మాజీ జటప్రోలు రాజాస్థాన కవి
స్నేహలతా కవితా సంఘాధ్యక్షుడు
మహబూబ్ నగర్,

నా స్నేహలతా కవితాసంఘ సహస్ర సభ్యులలో చి॥ కేశవాచార్యులు, బి. ఏ., ముఖ్యుడు. సాహిత్యలోకమునఁ బేరెన్నిక గన్నవాఁడు. కవితా రసప్రియుండని రసజ్ఞులకుఁ దెల్లమే. లోగడ నేను జటప్రోలు సంస్థాన కవిగా నున్నప్పుడు నావద్ద చదువుకొన్న శిష్యకోటిలో నితఁడు నాకు ప్రియ శిష్యుడు. ఇతడెంత దైవభక్తి కలవాడో అంత కవితాశక్తి కల వాడు. నిరాడంబర జీవి. ఉన్నతాశయములుగల వ్యక్తి. పిన్న వయసునుండియే చక్కని కవిత్వము వ్రాయనేర్చిన 'సహజకవి'.

మాత, మాతృభూమి, మాతృభాష, యీ మూడింటి యందభిమానము మక్కువగాఁగల వాడని యీ కృతి సాక్ష్య మిచ్చుచున్నది.

క్రొత్త పోకడలతో, భావ గాంభీర్యముతో, మృదు మధుర పదజాలముతో హృదయంగమముగ రచింపఁగల నేర్పు కూడ్పుఁగాంచిన కవి వీరుఁడితఁడు. 'ప్రౌఢ కవి' బిరుద మునకు తగినవాడు.

ఇట్టి మనోహరములగు కృతులను రచించు శక్తి మా కేశవునకు శ్రీ కేశవుఁడనుగ్రహించుఁగాక! పట్టభద్రుఁడై పెద్ద యుద్యోగపదవిలో నున్నను మాతృభాషాసేవను మరవక జేయుచున్న యీ కవి రత్నమునకుఁ జిరాయురారోగ్య భాగ్య శ్రీలు గలుగుఁగాక!

మహబూబ్ నగర్,	బుధజన విధేయుఁడు
ది. 27-5-1978	రా. సు. రా ట్క వి

Sri K. Vasudeva Rao, I A.S.,
Ex-Commissioner,
Endowment Department.
Govt. of Andhra Pradesh.

Sri Keshavacharya is a gifted poet and writes generally on the Subject of "Bhakthi" As Collector, Hyderabad I had the occasion to go through his book on "Kesaragiri Sri Ramalingeswara Nakshatramala" It is a popular book relating to Sri Ramalingeswara Swamy of Keesaragutta, in Hyderabad District. He is a dovotee of Sri Raja Rajeswara Swamy. He has now composed "Sri Raja Rajeswara Sathaka" Keeping in view the deity of Sri Raja Rajeswara Swamy at Vemulavada. He has also taken the trouble of giving the preface in Telugu on "Vemulavada Mahakshetram" The preface together with the book will be very useful in the Praise of Sri Raja Rajeswara Swamy.

As he is a Government Employee he is not able to print this by him self. The Devasthanam should undertake such enterprise and encourage such ventures.

Two things are te be done. One is publication of the Book and the Other is adequate remuneration to the poet. The later may be a lumsum amount or any arrangements by which the poet can be suitablly rewarded.

Hyderabad
D. 8-2-1970

—**K. Vasudeva Rao.**

D. V. Krishna Mnrthy,
Amature Litterary Critic,
HYDERABAD.

I consider it as a matter of proud privilege to pen a few words of introduction on this unique publication devoted entirely to represent the universal aspect of God's innate kindness and love. I have also considered it to be, not a maiden attempt at all, in view of the poet's keenest observation to all the minor details that confront the day to day adversities in this mundane life of ours. I am happy to point out that this presentation gifted away as a choice piece to the feet of Swamy Raja Rajeswara throws in abundance satiriclly all the events that take place amidst us, politically, socially, and economically. To mention a few, the poet lashes out in hysterical terms. of no mean description, the battle of the ballot-box, the enlargement of the gulf of the rich and the poor, and the height of ignorance that prevail inspite of each becoming devotional in his attitudes towards the values of life.

The consensus of the poetical genius of this gifted author suggests only one solution—viz., to devlop and to sustain that development in outlook by each individual in the society and to keep on striving for the establishment of a powerful catholicity of outlook towards oneness of life, the redeemer and the rewarder ultimately being that God only who is described by various appellations in all the religions is, through the centuries, necessarily the working of Universal welfare.

I only wish that the energies expended in this small booklet which is a specimen of brevity should be appropriately received not only by the general reader but by all the devout of all faiths also.

I wish him all prosperity in the name of Sri Raja Rajeswara Swamy and commend this book for the propagation of universality in faith by suggesting the concerned authorities to encourage this text to be kept in all the public institutions.

Hyderabad. **—D. V. Krishna Murthy**
D. 9-2-1972

Thou hast been the fountain perennial
Granting boons of prosperity,
What can I offer Thee, My Grace,
Save my total submission. 1

What imbecility to count the individual drops of rain,
Or the rays of sun or of its counterpart:
How can this mortal brain assess now Thy Glory
And Thy Grace despite his myriad avowed failures? 2

Come out from Thy divine Silence
Come to see the mortal toils
Come again to lift them that keep on to Thy Lotus Feet.
Come, Come on Oh Dear Lord, fast to our vicinity. 3

(From "A Century Praise To The Good Most High"
Free translation of This Satakam by Sri D. V. K. Murty)

కపిలవాయి లింగమూర్తి, M.O L.
వాణీ సదనం.
నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లా.

రసవిపంచిక

ఈ శతకకర్త "రసప్రియ" గా పాఠక లోకానికి చిరపరిచితులు వీరి యింటిపేరు "ఫోతేదారు" వారు. వీరి పూర్వులు వనపర్తి ప్రభువుల దగ్గర ఫోతేదారులుగ పనిచేసి కీర్తి ప్రతిష్ఠల నార్జించిరి. హొంసదుర్గం కృష్ణమాచార్యుల వారిచే ఉత్తర రంగమని కీర్తించబడిన శ్రీ రంగాపురం కవిగారి జన్మగ్రామము. ప్రస్తుతము వీరు గణాంక శాఖ లోగణనీయ మైన ఉద్యోగిగానున్నారు.

అంకెలు అక్షరాలు అత్తాకోడళ్లు కనుక వానికెప్పుడూ ఎడమొగం పెడమొగాలే, ఒకటి కాలుపెట్టిన మస్తిష్కం కడపలో మరొకటి కాలు పెట్టదు. మా కేశవాచార్యుల విషయంవేరు. వారి వృత్తివేరు, ప్రవృత్తి వేరు. కవితాలక్షణాలు పనిగట్టుకొని చదువకపోయినా పండిత పదవిలో నిలిచిన అస్మదాదులం కవులం కావటంలో వింతలేదు. కాని కేశవా చార్యుల వంటి వారిని జూచినపుడు కవులు తయారుకారు పుడతారు అని ఋజువౌతుంది

ఈ శతకంలో స్తుతి, విన్నపం అను రెండు విషయాలున్నవి. కవిగారి మనోవాక్కులు రెండు వానిలో ప్రసిద్ధ మార్గంలో విహరించి నవి. వీరిలేఖిని ఎడనెడ శబ్దాలంకారాలైన అంత్యప్రాసల విరజిమ్మతు యతిప్రాసలతో గూడిన వృత్తరచన తనకొక లెక్కగాదన్నంత అవ లీలగా నడిచింది.

44 వ పద్యంలో వీరు శివుని ఏనుగుతోలు కప్పుకొని హిమాల

యాలలో చలికి ఎక్కడుంటావు, నా హృదయంలో వెచ్చగా ఉంటుంది రమ్మంటాడు. 45 వ పద్యంలో ఈనాటి లోకంలో విషమెత్తుకోవటం కష్టం కనుక నీ కోడెకు జతగా నా వ్యామోహమనే కోడెనిస్తాను. బీడువడ్డ నా మానసక్షేత్రంలో వ్యవసాయం చేసుకో. ఉభయులకు లాభం. (నాకు మాన్యంపాలు, నీకు సేద్యంపాలు) అని అంటాడు.

దీనిలో 77 నుండి 88, 92 నుండి 96, 115 నుండి 133 వరకు గల పద్యాలు చదువుతుంటే వీరికి ఈనాటి సమాజంలో జరుగుతున్న అన్యాయాలపట్ల ఎంతతీవ్రమైన ఆవేదనవుందో తెలుస్తుంది దానికితోడు భక్తిభావన, విశ్వైకభావన గూడా నిండుగా ఉన్నవి. 49వ పద్యం, 134వ పద్యం చదవండి. భగవంతునిపట్ల మానవుని ఆత్మనివేదనకు స్వస్వరూప సంధానానికి ఇంతకన్న పరాకాష్ఠ ఇక యుండదు.

రసప్రియ గారు దీనిలో మొత్తం 147 పద్యాలు వ్రాసినారు. (నివేదన, కవిస్తుతి లోని పద్యాలు కలుపుకొని) అష్టోత్తర శత సంప్రదాయము ననుసరించి 108 పద్యములకే శతకమగును. అందుకే ఇందు 108 వ పద్యం మంగళపద్యము నుంచిరి కవిగారు. తక్కిన పద్యాలు విన్నపాలుగా కనిపిస్తవి.

వీరి పద్యాలు ధూర్జటి శతకంలోని పద్యాలవలె భావపుష్టికలిగి ప్రౌఢంగా సాగినవి. వీరిని "అభినవ ధూర్జటి" యనుట యెంతయు సముచితము "ప్రౌఢకవి" యని రా. సు. రాట్కవిగారు 'రసప్రియ" యని కవిసింహ కాశీపత్యవధానులవారు ఇచ్చిన బిరుదములు వీరి యెడ సార్ధకములైనవి. కనుక వేములవాడ రాజరాజేశ్వరునిపై గంగాప్రవాహ సదృశమైన పావనశైలిలో ఈశతకాన్ని రచించిన రసప్రియగారు సుకృతులు.

నాగర్ కర్నూలు
ది, 31-12-82

—కపిలవాయి లింగమూర్తి

కృతజ్ఞతలు

నా యీ శతకమునకు దయతో తమ అమూల్యమైన అభిప్రాయములరూపమున అభినందనాశీర్వాదముల ననుగ్రహించి నన్నెంతయు ప్రోత్సహించిన పెద్దలు పూజ్యులు పుంభావసరస్వతి శ్రీ ఆచార్య డా॥ దివాకర్ల వేంకటావధానులుగారికి, విశ్వవిఖ్యాత విద్వత్కవులు చరిత్ర కారులు శ్రీ గడియారం రామకృష్ణశర్మ గారికి, సుప్రసిద్ధ మహాకవులు ప్రజాకవులు ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవివర్యులు శ్రీమాన్ డా॥ దాశరథి గారికి, సహృదయులు సాహిత్యాభిమానులు శ్రీ కొండపల్లి వాసుదేవ రావు, ఐ.ఎ.ఎస్. (మాజీకమీషనర్ దేవదాయ ధర్మాదాయశాఖ) గారికి, విఖ్యాత విద్వత్కవులు చరిత్రపరిశోధకులు శ్రీ కపిలవాయి లింగమూర్తి గారికి, విఖ్యాత విమర్శకాగ్రేసరులు ఆంగ్లకవిశేఖరులు శ్రీ డి. వి. కృష్ణమూర్తిగారికి, నా హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనములు.

ఈ సందర్భమున గురువర్యులు; కీ॥ శే॥ పోకూరి కాశీపత్యవధానులుగారికి, మరియు కీ॥ శే॥ వాజపేయయాజుల రామసుబ్బారాయుడు గారికి, నా హృదయపూర్వక భక్త్యంజలులు.

ఈ గ్రంథ ముద్రణార్థము ఆర్థిక సహాయ్యమందించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము పాలకవర్గము వారికి నేనెంతయు కృతజ్ఞుడను.

ఈ గ్రంథమును శ్రద్ధగా ప్రూపులుదిద్ది, అందముగా అచ్చొత్తి యిచ్చిన కవి మిత్రులు కవిభూషణ శ్రీ యర్రం విశ్వనాథంగుప్త, ప్రొప్రైటర్, వై. వి. ప్రెస్, ఖమ్మం గారికి ధన్యవాదములు.

ముఖచిత్రము వేసిన మా చిరంజీవి రాజశేఖరునకు, శుద్ధప్రతులు వ్రాసిపెట్టిన మా అమ్మాయిలు జయశ్రీ విజయశ్రీ లకు అభినందనాశీర్వాదములు.

ఖమ్మం.
ది. 28-1-83

—రసప్రియ

వేములవాడ మహాక్షేత్రము

యుగాలు గడచినను కాలమెంత మారినను చరిత్ర కందని యే యుగాలనాటి నుండియో మన పుణ్యక్షేత్రములు నేటికిని వెలయుచు అనంత జగత్తునకు ఆస్తికతను ఎలుగెత్తి చాటుచు భాషా ప్రాంతాలకు పరిమితము కాక ధర్మ సంస్థాపకములై సనాతనములై మానవ కల్యాణార్థము వెలసియున్నవి. ఇట్టి ప్రాచీన తరములైన పుణ్యక్షేత్రములలో వేములవాడ మహాక్షేత్రమొకటి, ఇది ప్రధానముగా శైవక్షేత్రమైనను సర్వమత సమాశ్రయ సంధాయిని. ఈ మహాక్షేత్రము ఆంధ్రప్రదేశమున తెలంగాణా ప్రాంతానికి చెందిన కరీంనగరు జిల్లా సిరిసిల్లా తాలూకాలో నున్నది కరీంనగరానికి పశ్చిమాన 20 మైళ్లు, హైద్రాబాదు పట్టణానికి ఉత్తరాన 130 మైళ్ల దూరముండును. జ్యోతిర్లింగముగల కాళేశ్వరము, యోగనరసింహస్వామి వెలసిన ధర్మపురి మహాక్షేత్రములు ఈ జిల్లాలోనేయున్నవి.

మానవోద్ధరణకై వేములవాడలో దయాసింధువును, జగద్రక్షకుడునైన శ్రీ రాజరాజేశ్వరస్వామి జగజ్జనని శ్రీ రాజరాజేశ్వరీ దేవి సమేతముగా వెలసి అసంఖ్యాకమైన భక్తజనుల సేవలనందుకొనుచు వారి మనోభీష్టముల నెరవేర్చుచున్నాడు. శ్రీ స్వామివారి మహిమ అనుభవైకవేద్యమే కాని వర్ణింప నలవికాదు. స్వామిని సందర్శించి వ్యాధి గ్రహాదీతి బాధల నివర్తింప జేసికొన్న భక్తులనేకులు గలరు. ఆస్తికత యడుగంటిన నేటికాలమున కొందరి దృష్టిలో భగవద్భక్తులు వెఱ్ఱివారుగా గన్పించవచ్చును. కాని యెవరి నమ్మకాలు వారివి. నా నాటికి ఈ క్షేత్రానికి ధనవ్యయ ప్రయాసలకోర్చి సుదూరమునుండి దిన దిన ప్రవర్ధమానముగా భక్తజనులు తండోపతండములుగా వచ్చుట నిర్హేతుకము కానేరదు. "నమ్మి చెడువారు నాస్తి యేనాటికైన"

పూర్వ చరిత్ర

ఈ పుణ్యక్షేత్రమతి ప్రాచీనమైన దనుటకనేక పౌరాణిక చారిత్ర కాధారములు గలవు, త్రేతా యుగమున శ్రీరామచంద్రుడు, ద్వాపరమున పాండవులు ఈ దివ్యక్షేత్రమును సందర్శించి భక్తితత్పరులై స్వామిన ర్చించి తమ మనోభీష్టముల నీడేర్చుకొనిరి. చరిత్ర కందినంత వరకు 'వేములవాడ' చాళుక్యులకు రాజధానిగా నుండెను. "వేములవాడ చాళుక్యులు" అని చరిత్ర ప్రసిద్ధము. ఈ వంశమున పది తరములవారు క్రీ. శ. 750 నుండి 973 వరకు వేములవాడ రాజధానిగా విశాల భూభాగమును పాలించిరి వేములవాడ రాజధానిగా చాళుక్య ప్రభువులు వేంగి దేశమును పాలించిరందురు. వేములవాడ చాళుక్యుల తర్వాత కల్యాణి చాళుక్యుల ఆధిపత్యముండినది. చాళుక్యుల అనంతరము వేములవాడ రాజధానిగా ప్రాముఖ్యతను గోల్పోయెను, తర్వాత యాదవులు, కాకతీయులు ఈ మండలమును 'యలగందల' రాజధానిగా పాలించిరి

వేములవాడ చాళుక్యులు శిల్పకళా పోషకులు సర్వమత సామరస్యము గలవారు. జైన, శైవ, వైష్ణవ శాక్తేయాది మతములును, సంస్కృతాంధ్ర కర్ణాటక భాషలును రాజ పోషణము నంది సంతరింప బడినవి. క్రీ. శ. 10వ శతాబ్ది యారంభమున ఈ వంశపురాజు అరికేసరి కర్ణాటక భాషా పోషకుడై కన్నడములో ఆదికవి యనబడు 'పంపడు' అను జైన మహాకవికి తన కొలువులో నుద్యోగమిచ్చి అతనిని గ్రంథ రచనకు ప్రోత్సహించెను. కర్ణాటక ఆదికవిని పోషించిన గౌరవము వేములవాడకే దక్కినది. వేములవాడకు దాదాపు నాల్గుమైళ్ల దూరములో నున్న కుడిత్యాల గ్రామములో లభించిన శాసనమువల్ల పంప మహాకవి వేములవాడ నివాసియను విషయమును రుజువు పరుచుచున్నదని పురావస్తు పరిశోధనాశాఖవారు (ఆంధ్రభూమి-7 సెప్టెంబరు 1970) ప్రకటించిరి.

ఈ చాళుక్య ప్రభువులలో నొకరీ దేవాలయ పునరుద్ధరణము గావించి నట్లు యిక్కడి శిలాశాసనములు పేర్కొనుచున్నవి. శ్రీ రాజరాజేశ్వర స్వామి చాళుక్యుల ఇలువేలుపు

రాజేశ్వర ఆలయము

వేములవాడ అనేక దేవాలయములకాలవాలము. శ్రీ రాజరాజేశ్వ రాలయము ప్రధానాలయము. ఇది తూర్పునకభిముఖమై యున్నది. ఆల యాంతర్భాగము సువిశాలమైనది ఆలయ ప్రవేశమాత్రాన మనశ్శాంతి కలిగి అంతఃశుద్ధి యేర్పడుచుండును. స్వామికి ఎదురుగా ముచ్చటగొల్పు నందులజత, కుడివైపున రాజరాజేశ్వరీదేవి ఆలయము, ఎడమ భాగమున శిల్పకలా చాతుర్యమునుచాటు లక్ష్మీగణపతియు గలవు. అమ్మవారి విగ్ర హము సలక్షణ శిల్పకళా శోభితమై ప్రసన్న వదనారవిందముతో జగ న్మాతృత్వమును ప్రస్ఫుటింప జేయుచున్నది. శ్రీ రాజరాజేశ్వరలింగము అతి ప్రాచీనమై, ప్రశాంతమై, దివ్యతేజోవంతమై దర్శన మాత్రాన " హర హర మహాదేవ శంభో ! " అనుచు సాష్టాంగపడి మ్రొక్కు లర్పింపవలెనను భక్తిరసావేశము భక్తులకు కలుగుచుండును. ప్రతిదినము అర్చన సంసేవనాది ఉత్సవాదులతో బహుయాత్రికుల నాకర్షించుచు నీ క్షేత్రము కలకల లాడుచుండును ఆలయాంతర్భాగ ప్రాంగణమందు ఒక పురాతన శిలాశాసనము, గండదీప స్థంభము, కల్యాణ మంటపము, నాగిరెడ్డి మంటపము గలవు. వీటి మాటున అద్భుత మత సాంస్కృతిక చారిత్రకాంశములు దాగియున్నవి.

ధర్మకుండము

ఇచటి ధర్మకుండమతి ప్రాచీనమైనది. ఇందలి జలమత్యంత మహిమాన్వితమైనది. ఈ పవిత్రోదక మహిమను వెల్లడించు గాథలనేక

ములు గలవు. పూర్వము ఇంద్రుడు వృత్రాసురుని జంపి బ్రహ్మహత్యా పాప పరిహారార్థము ఈ ధర్మకుండమున స్నానమాచరించి శ్రీ రాజరాజేశ్వరుని పూజించి పవిత్రుడాయెననియు, భాస్కరుడు దక్షయజ్ఞములో హావిస్సు నపహరించుటచే బాహువులు గోల్పోయి ఇందలి జలమున స్నానమాడి స్వామినారాధించి స్వర్ణ బాహువులు పొందెననియు, అంతియేగాక కలియుగమున మాళవదేశపు రాజు రాజరాజ నరేంద్రు డిందలి జలము ద్రావి యిందు స్నానమాడి స్వామిని సేవించి అనివార్య రోగ విముక్తి నొందెననియు నీ కుండమునకు సోపానములతడే కట్టించెననియు మున్నగు విశేషములు ఈ క్షేత్ర చరిత్ర తెలుపుచున్నది. ఈ మాళవప్రభువైన రాజరాజ నరేంద్రుని కుమారుడే సారంగధరుడని, లోక ప్రసిద్ధమైన సారంగధర చరితము యీ ప్రాంతములో జరిగినదని చెప్పుదురు. వేములవాడ కనతిదూరమున నామ్పల్లి అను గ్రామము ప్రక్కనే ఒక కొండ-ఆ కొండపై శ్రీ నరసింహస్వామి వారి ఆలయము, నపనాథుని గుహ, సారంగధర చరిత్రకు సంబంధించిన చిహ్నములు దర్శనీయములై యున్నవి.

నేటికిని ఈ పవిత్రజల స్నానపానాదులచే వ్యాధిగ్రహాది బాధలు నివర్తిల్లునను భక్తివిశ్వాసములు ప్రబలియున్నవి. భక్తులు ముందుగా నిందు స్నానమాచరించి స్వామిని సందర్శించుట యాచారము.

ఉత్సవములు

ప్రతి సంవత్సరము మాఘ - ఫాల్గుణ మాసములలో భక్తులు వేలాది సంఖ్యలో దూర దూరములనుండి వచ్చి స్వామిని సందర్శించి సేవించుచుందురు ముఖ్యముగా మహాశివరాత్రి ఉత్సవమత్యంత వైభవోపేతముగా జరుగుచుండును. ఈరోజు యాత్రికులసంఖ్య అసంఖ్యేయమై

పోవును. ఫాల్గుణ పూర్ణిమనాడు స్వామివారి కళ్యాణ మహోత్సవము కన్నుల పండుపుగా జరుగును. ఇచట జరుగు ఉత్సవాదులు మహారాజా స్థాన సంప్రదాయము కలిగి పూర్వపై భవాది ప్రత్యేక విశిష్టతను చాటు చున్నవి. మధుర మంగళ తూర్యాదులు. భేరీ నినాదములు, ధ్వజపతాక తోరణాదులు, వేదమంత్ర ఘోషలు, శాస్త్రి చర్చలు, సంగీత సాహిత్య సభలు, నృత్యకళా విలాసములు, పురాణహరికథా కాలక్షేపములు మొద లగునవి మానసోల్లాసము గూర్చుచు నెంతో వేడుకగా నుండును. ప్రతి దినము ప్రాతఃకాలమున సుప్రభాతాది మంగళ గీతములు మధుర కంఠ ముతో వినిపించుచు ప్రసన్న ప్రశాంత పవిత్ర వాతావరణమును సృష్టిం చుచుండును

భీమేశ్వరాలయము

ఈ క్షేత్రమున ప్రబలాకర్షణీయమై అత్యంత ప్రాచీనమైనది శ్రీ భీమేశ్వరాలయము. శ్రీ భీమేశ్వరస్వామి అనుగ్రహపాత్రుడై 'భీమకవి' అద్భుత శక్తి సంపన్నుడయ్యెనని అందురు. నన్నయ భట్టారకుడు భార తము వ్రాయుచున్న కాలముననే భీమకవి "రాఘవ పాండవీయము" అను ద్వ్యర్థికావ్యమును 'కవిజనాశ్రయ'మను లక్షణగ్రంథమును వ్రాసె నందురు భీమేశ్వరాలయ నిర్మాణము అత్యద్భుతము. ఇందలి శిల్పకళా నైపుణ్యము వర్ణనాతీతము.

హరిహర క్షేత్రము

ఈ క్షేత్రమున జ్యోతిర్లింగమని పిలువబడు కాశీవిశ్వేశ్వర లిం గము కలదు అందుచేత నీ క్షేత్రమునకు "దక్షిణకాశి" యని ప్రసిద్ధి కలిగినది. దక్షయజ్ఞగాథ యిచట జరిగెనని అందుచేత నీ క్షేత్రమునకు

"దక్షవాటిక" యను నామాంతరము కలిగెనందురు. ఇచట వీరభద్ర స్వామి విగ్రహమున్నది శైవాలయముతోపాటు వైష్ణవాలయము లుండుటచే నీ క్షేత్రము "హరిహరక్షేత్ర" మనదగియున్నది. ఇచట అనంత పద్మనాభస్వామి ఆలయము, కోదండరామస్వామి ఆలయము అర్జునుడు పూజించెనను బాల రాజేశ్వరాలయము. కేదారేశ్వరాలయము. బలిపీఠము కలిగి శాక్తేయమతమును స్మృతికిదెచ్చు బద్ది పోచమ్మ ఆలయము, నగరేశ్వరాలయము, 'విశ్వకర్మ' గా గుర్తింపబడిన పంచముఖ బ్రహ్మాలయము మొదలగునెన్నో దేవాలయములు గలవు. ప్రతి దేవాలయమున కొక మహాత్మ్యము, విశిష్టత కలదు ఇచటి 'వల్లిబండ' బహుభక్త జనాకర్షణీయమైనది.

సర్వమత సామరస్యము

ప్రధానముగా శైవక్షేత్రమైనను ఇచట శైవమూర్తులేకాక వైష్ణవ జైన బౌద్ధ నాగ శాక్తేయాది విగ్రహములుకూడ పూజల నందుకొనుట, ప్రధానాలయ ప్రాంగణముననే మహ్మదీయ దర్గా వెలసి హిందూభక్తుల సయితము నాకర్షించుచు నివేదనల నందుకొనుట ఒక అపూర్వ సంప్రదాయము. వివిధ మతములందు సమైక్యభావమునెరపి 'వసుధైక కుటుంబము'ను దివ్యభావము స్ఫురింపజేయుచు సర్వమత సామరస్యమును నెలకొల్పుచు అఖండ మహిమాన్వితమైన ఈ మహాక్షేత్రము మానవ కళ్యాణార్థము వెలసియున్నది.

కుబేరు డీశ్వరు నారాధించి ఈశ్వరానుగ్రహమున మహాసంపన్నుడాయెను కుబేరునకు రాజరాజు అను పేరు కలదు. కుబేరుడారాధించుటచే రాజరాజేశ్వరుడను పేరువచ్చెనేమో! ఈశ్వరారాధనము ఐశ్వర్య సాధనము. 'ఖ్యాతిమిచ్ఛేత్మహేశ్వరాత్' కావున అష్టైశ్వర్య ప్రదాతయగు శ్రీ రాజరాజేశ్వరు నారాధించి ఇహ పర సౌఖ్యములబడసి మానవాళి తరించుగాక!

నివేదన

ఇరువై మూడేండ్ల క్రిందటి మాట. 1959 సెప్టెంబరు నెలలో మొదటిసారిగా నాకీ పుణ్యక్షేత్రమును సందర్శించు భాగ్యము కలిగినది. నే నప్పుడు మాతృశోకముతో పరితపించుచు "మాతృశ్రీ" వ్రాయుచుం టిని. బహుకాలము వరకు నా కప్పుడు మనశ్శాంతిలేదు. ఉద్యోగరీత్యా నేనప్పుడు కరీంనగరులో నుంటిని. అప్పుడప్పుడు వేములవాడ రాజరాజే శ్వరస్వామిని సందర్శించుచు కొన్నిపద్యములు "శ్రీరాజరాజేశ్వరా" అను మకుటముతో మా మాతృశ్రీ ఆత్మశాంతికై ఆవేదనలో రచించితిని. మాతృశ్రీకాత్మశాంతి ప్రాప్తించిన సంగతి నెఱుంగను కాని శ్రీ స్వామి సందర్శన భాగ్యముచే పరితపించు నా యాత్మకూఱట కలిగెను. సంద ర్శించి నప్పుడెల్ల స్వామి సాన్నిధ్యములో నొకటి రెండు పద్యములు వ్రాసితిని అట్టి పద్యములీ శతకమందలి ఈ సంఖ్యలు గలవిగా గుర్తిం చనగును. (7, 10, 33, 34, 35, 48, 59, 63, 110, 111, 112)

1962 జూలైలో తిరిగి నా బదిలీ హైదరాబాద్ నగరమున కయి నది. వాతావరణము మారినను నా హృదయ మందిరములో శ్రీ రాజ రాజేశ్వరస్వామి మధుర మంగళ నామ మకుటము మారుమ్రోగు చుండె డిది. ఈ త్రిగజన్మోహన మకుటములో నేమహత్తుగలదో కాని నాకవితా కుమారి మకుటస్మరణ మాత్రాన మాటి మాటికి మత్తేభ శార్దూలములపై నెక్కి విజయ విహార మొనరించ నుత్సహించినది. శ్రీ స్వామి భవ్య కృపా సహాయ్య మండగాగ్రైకొని నా నేర్పుకొలది భక్తిరస ప్రధానముగ ఈ శతకమును పూరించితిని. శ్రీ స్వామి దివ్యనామ మకుటస్మరణయే నా యీశతక రచనకు ప్రేరణ.

ఈ శతకమును పూరించుచున్న కాలముననే కేసరస్వామిని 1966 శివరాత్రికి సందర్శించుకొన్న సందర్భమున కేసరాద్రినిలయా "శ్రీరామ

లింగేశ్వరా" అను మకుటముతో నక్షత్రమాలను వ్రాసి శివరాత్రికి 1968లో ప్రకటించితిని. ఇది నాతొలి ముద్రిత గ్రంథము, దీనికి పూజ్యశ్రీ దివాకర్ల వేంకటావధానులవారనుగ్రహించిన అభినందనాశీర్వాదము నన్నెంతో ప్రోత్సహించి, నాకలమునకు ఎంతో బలము నిచ్చినది భక్తి ప్రధానములును నాకు ప్రీతిపాత్రములునైన ఈ శతకమందలి కొన్ని పద్యములను నక్షత్రమాలలో చేర్చితిని.

నేనీ శతకము వ్రాయుచున్నప్పుడు పూజ్యులు కీ॥ శే॥ శ్రీ మహాకవిశేఖర పోకూరి కాశీపత్యవధానులుగారు, శతావధాని శ్రీ దోకూరికోట్ల బాలబ్రహ్మాచార్యులుగారు నా పద్యములువిని ఆనందించి నా వెన్నుతట్టి వాత్సల్యముతో నన్నెంతో ప్రోత్సహించి దీవించిరి.

ఇది ద్వితీయ ముద్రణ. మొదటి ముద్రణ మహాశివరాత్రి 1972 లో జరిగినది అప్పుడు శ్రీ వేములవాడ దేవస్థానమువారు రు. 216/- పారితోషికముగా నాకు బహూకరించిరి పదేండ్లయినది. వెయ్యిప్రతులు ఎప్పుడో అయిపోయినవి మళ్ళీఇప్పుడు శ్రీ టి, టి, డి, వారి ఆర్థికసహాయ్యముతో ఈ ముద్రణ భాగ్యము కలిగినది. ఇది నాకు నేనై ప్రయత్నించినదికాదు నాకొకనాటి రాత్రి సిద్ధార్థి ఆశ్వీయుజ అమావాస్యరాత్రి తెల్లవారితే సోమవారము (చిత్రనక్షత్రం తెల్లవారుజామున) స్వప్నములో శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దివ్యలింగ సందర్శన భాగ్యము కలిగి ఆ దివ్యలింగములో లీలగా శ్రీ స్వామి దివ్యతేజో విలాస భాసుర వదనారవిందము అత్యంత సుందరములైన పెదవుల కదలికతో "రాజరాజేశ్వరశతకం మళ్ళీముద్రించుమని ఆనతిచ్చినట్లు చిరునవ్వు చిందిస్తూ ధరతక్కువ పెట్టుమన్నట్లు స్వప్నమయ్యెను. తెల్లవారలేచి కలలు భ్రమలనుకొనే నేను ఇంత సుస్పష్టమైన దివ్య స్వప్నమును తేలికగా త్రోసిపుచ్చుటకు మనస్కరించక కొంత తడవాలోచించి ఇది స్వామివారి ఆదే

శముగా తలదాల్చి ఈ శతక పునర్ముద్రణకై ప్రయత్నించ నిశ్చయించు కొంటిని. ఆ రోజునుండే శతకమును తిరిగి వ్రాయ నారంభించితిని. మొదట వ్రాసి అచ్చులో చేర్చక వదలిన అధిక పద్యములనుకూడ చేర్చి శతకమంతయు ఎత్తి వ్రాసితిని. మా అమ్మాయిలు రెండు శుద్ధప్రతులు వ్రాసిపెట్టిరి. టి,టి డి, వారి అడ్వర్ టైజుమెంటు ధార్మిక సంబంధమైన గ్రంథముద్రణ సహాయ్యముగురించి వార్తాపత్రికలో వచ్చినసంగతి దృష్టి కిరాగా ఒకప్రతి శ్రీ టి.టి,డి, వారికి పంపుతూ ముద్రణకై ఆర్థిక సహాయ్యమర్థించితిని. వారిసహాయ్య సంపత్తితో ఈ ముద్రణ కార్యక్రమము నెరవేరబడి నేను కృతార్థుడనైనట్లు భావిస్తున్నాను. ఈ స్వప్నము రాకుం డినచో నేనీ ముద్రణకు ప్రయత్నించి యుండువాడనుకాను. టి,టి,డి, వారికి ముద్రాణార్థము నా మరొక గ్రంథము అచ్చుకాని వాటిలోనుండి "శ్రీరంగ శతకము" కాని "భద్రగిరి శతకము" కాని "శ్రీ వెంకటేశ్వర స్తుతిమాల" కాని పంపియుండువాదను. ఈ శతకము పంపకుందును. అంతయు నీశ్వర సంకల్పముకదా! ఆ సందర్భమును పురస్కరించు కొని వ్రాసిన పద్యమిది.

అది స్వప్నస్థితి లింగమందు దరహాసాస్యంబుతో నాకు నిం
పొదవన్ దర్శనమిచ్చి నాడు శతకంబున్ మళ్లిముద్రించి దా
ని దరన్ దక్కువ బెట్టుమంటి వదియున్ టీ,టీ,డి, నీయాన దే
ర్చె దయన్ నన్ను గృతార్థుఁజేయఁగఁ బ్రభూ! శ్రీ రాజరాజేశ్వరా!

మరొక విషయము విన్నవింతును నేను చిత్తూరులో పనిచేయు చున్నప్పుడు 1972లో ఒకనాడు శ్రీ జగద్గురు కంచికామకోటి పీఠాధిప తులు శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వాములవారిని సందర్శించి శ్రీ స్వామివారికి అప్పుడే అచ్చుఅయిన ఈ శతకమును సమ ర్పించుకొంటిని. శ్రీవారు అమితానందభరితులై నాగ్రంథమును స్పృశించి

చిరునవ్వులతో నన్నాశీర్వదించిరి. అదేరోజు శ్రీ శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వాములవారినిగూడ సందర్శించి వారికిని ఒక ప్రతి సమర్పించి నమస్కరించితిని. శ్రీ వారు మిక్కిలి సంతసించి నన్ను కూర్చుండబెట్టుకొని కొన్ని పద్యములు నాచే చదివించుకొని విని ఆనందించి నన్నాశీర్వదించిరి. నాకింతకన్న ఏమికావలె. శ్రీ జగద్గురు స్వాములవారల మహదాశీర్వాదములు ఈ దివ్య స్వప్న వృత్తాంతము నన్నెంతో ప్రోత్సహించి ధన్యుని జేసినవి.

శతకమంతయు భక్తిరస ప్రధానముగా రచించుటే నాధ్యేయము. కాని భక్తిగురించి నాకేమియు తెలియదు దానిగురించి చెప్పలేను. అదొక అనిర్వచనీయమైన రసానుభూతిగా నాకనిపించును. భక్తియున్న పరమార్థము సిద్ధించునని భక్తిలో రక్తి రసానుభూతి కలదని నమ్మెదును. కష్టనివృత్తి సుఖప్రాప్తి ఈరెండే ప్రతిప్రాణి కోరునది. ఈరెండునూ భక్తితో భగవంతుని ఆరాధించుటలో సాధ్యమగునని నా నమ్మకము.

ప్రవాహముతో కొట్టుకొని పోవువాడు ఏదోయూతకై ప్రాకులాడు నట్లు కష్టాబ్ధిలో ప్రాణికోటి నిస్సహాయ స్థితిలో ఏదో మానవాతీతమైన దైవశక్తి నాశ్రయించక తప్పదు.

పసిబిడ్డ చనుబాలకై తహతహ పడునప్పుడు అంతకు వెయ్యింతల తహతహతో కడలెత్తిపొంగు తల్లిప్రేమవంటిది. దైవానుకంపనము.

అట్లని పురుషకారమును విస్మరించువాడనుకాను. పురుష ప్రయత్నమునకు దైవానుగ్రహములేకున్న నిరర్థకమని దైవముపై భారముపైచి పురుషకారము సాగించవలెనని నా భావము. శ్రమైకజీవనములో విశ్వాస మున్నవాడను. శ్రమైకజీవన సౌభాగ్యమునకై ఈశ్వరుని ప్రార్థించుచు వ్రాసిన పద్యములు రెండు పొరపాటున శతకమందుచేర్చబడనివి ఈ క్రింద విన్నవింతును.

అవనిన్ కార్మిక కర్షకాది జనులందశ్రాంతమున్ రేగుచు
న్నవి కష్టాగ్ని కణాలు వాటిని శమించన్ శ్రామిక స్వేద బిం
దువు లొక్కొక్కటి జేరి సంద్రమగుచున్ దుర్భిక్షమున్నార్పు ప
చ్చిన మార్గంబును జూపవే! హరహరా! శ్రీ రాజరాజేశ్వరా!

గుడిలోనుందువా! లేక గుండెగుడిలో గూర్చుందువో! రోజు బిం
దెడు స్వేదమ్ము స్రవించు శ్రామికుల యందీవుండవా? చెప్పు మె
క్కడ నీవుండవు? సర్వలోక నిలయా! కై మోడ్చి నీసేవ చే
సెడి భాగ్యంబిడి ప్రోవవే! హరహరా! శ్రీ రాజరాజేశ్వరా!

శతక మందలి పద్యములన్నియు భక్తిరసాస్పదములైనను శతక సంప్రదాయము ననుసరించి సాంఘికావస్థలు దెలుపు కొన్నిపద్యములిందు చివరన చేర్చితిని. రెండు దశాబ్దముల క్రింద వ్రాసినవైనను నేటికిని అవి సామాజిక దర్పణములుగా నున్నవి. చెడును నిరసించుట, మంచిని ప్రేమించుట, సామాజిక ప్రయోజనము కొరకై ఈర్ష్యా ప్రలోభాది అవగుణములను గర్హించుట కవుల ధర్మము కదా! దుర్భర సాంఘిక జీవనమునకు స్పందించని వాడెవడు? దురాచార దురాగతాది అకృత్యములు సంఘాభ్యుదయ నిరోధక చర్యలు ఏ రచయితను కలచక మానును? నైతిక విలువలు పెరగవలె! అభము తొలగవలె! శుభము చేకూరవలె! దానవత దెగడబడవలె! మానవత నెగడవలె! మనుగడ సాగవలె! విశ్వశ్రేయము వర్థిల్లవలె! ఇందుకు విశ్వకుటుంబియైన విశ్వేశ్వరుని కరుణావిలాసము చిందవలె! అందుకు పరమేశ్వరుని ప్రార్థించవలె అని నా భావన.

'ఇదియే నా కవితా ధ్యేయమ్!?
ఇదె కాదా విశ్వశ్రేయమ్!?

ఇంచుమించు అన్ని పద్యములందును కామ్యమును పొందుపరచితిని. చతుర్విధ పురుషార్థములందు కామము, మోక్షముకన్న ముందు చెప్పబడినది కదా! ఎన్నో పద్యములు ఉత్తమ పురుషములో అనగా "నన్నేలుకొ—నా వెచ్చని గుండెలో నన్ను కృతార్థు జేయగదవే!" మొదలగు వాటిలో వ్రాయబడుటచే స్వీయత్వ గోచరించినను, పఠితలు తమకుగా ననువర్తింప జేసుకొని నా అనుభూతిని వారి వారికి నచ్చినంత వరకు పంచుకొన వచ్చునని తలంతును. "విశ్వశ్రేయఃకావ్యమ్" అను సూక్తి ననుసరించి లోకైక క్షేమ మీ కృతియందలి కామ్యముగా పొందుపరచితిని. లోకము నుండి వేరుకాని నాకును మీకును సర్వజనులకును జగజ్జనకుడైన శ్రీ రాజరాజేశ్వరస్వామి క్షేమము చేకూర్చు గాక! అని ప్రార్థించుచు శ్రీస్వామి దివ్యచరణారవిందముల కీ శతకమును సమర్పించుకొనుచున్నాను. ఈకృతి సహృదయుల నలరించినచో కృతార్థుడనైనట్లు భావింతును.

"సర్వేజనా స్సుఖినో భవంతు!"

స్వామీ! నీవెటు మంచుకొండపయి వాసంబుంటివో! యెంతగా
నీ మేనెట్లు చలిన్ భరించెనోకదా! నీ కోసమై వెచ్చగా
ధామంబేర్పడనిత్తు నా యెదదలో తండ్రీ! వసింపంగదే!
శ్రీ మద్వేములవాడ మందిరవరా! శ్రీ రాజరాజేశ్వరా!

స్మృత్యంజలి

జననీ! నీ స్మృతి కొరకు నీశ్వరునకంకి
తముగ నిడినట్టి ఈ శతకమును వెలువ
రించినాడను గావి మాతృణమింత
దీరునే జన్మలెన్ని యెత్తినను గాని?

జననీ! కృపా తరంగిణి!
నినుదలచినయంత కనుల నిండుచు నుప్పొం
గిన జలమున నభిషేకం
బొనరింతు భవత్పదాబ్జ యుగళికి భక్తిన్!

భారమునెంచకుండ నను బంగరు గర్భమునందుమోసి, ఈ
ధారుణిజూపి, నీ అమృతధారలతో నను బెంచి నా పయిన్
బేరిమి కూర్మియెప్డు కురిపించిన తల్లివినీవు జన్మలో
నీ ఋణమెట్లుదీరు జననీ! పరిపూర్ణ కృపా తరంగిణీ!

కంటికిరెప్పవోలె ననుగన్న దినంబున నుండి యెప్పుడే
కంటకమంటకుండ కడగంటను గాచుచు నా కొకింత కీ
డంటిన రాత్రియున్ బవలు నారటమొందుచు నా సుఖమ్ముకై
కంటికొకింత కున్కయిన గానవుగా జననీ కృపాధునీ!

ఇంటికి పెద్దదిక్కవగుటీవెటు పమ్మెడబాయలేక నీ
వొంటరివై మరెక్కడ అయోమయమై పడికొట్టుకొంటివో!
కంటికి కానరావు మముగన్న దయామయి మాకు నీ పదా
లంటెడు భాగ్యమింక కరువయ్యెగదా! జననీ! కృపాధునీ!


నీదు సహనము భూమిని నీదు నీవి
జలదమును నీశుచిత్వము జాతవేది
నీ దయాపూర్ణత సుధాంబు నిధినిమించ
మాతృదేవతా నిన్నెట్లు మరువగలము!

జన్మజన్మల మరువక జనని ఋణము
వ్రాసికొందును హృదయ పత్రమ్ముమీద
మాతృమూర్తిని నిరతము మరువకుండ
హృదయ ఫలకము మీద చిత్రించుకొందు!

పరమసాధ్వివి సౌభాగ్యవతి వటంచు
వెదకి పేరంటమునకు నిన్ వేల్పుసతులు
పెద్ద ముత్తైదువ వటంచు బిలచిరొక్కొ!
కానిచో దివికిపుడె యేగంగనేల?

పుత్రులందు నీకు పుట్టెడు బేరిమి
కూతు మీద నీకు కూర్మిమెండు
భర్తమీద నీకు భక్తి నిండగు గాన
దివికి నెట్టులేగితివొ గదమ్మ!

అది "మాతృశ్రీ" దానిని
చదువుచునున్నపుడు కనుల జలమూరుట నే
నది ప్రకటించక నీ స్మృతి
కిది శివకృతి నిలుచునంచు నెంచితి తల్లీ!


F Raja Shekhar
నీవే విశ్వము విశ్వమంతయును నీవే కాననీదివ్యతే
జీవంతంబగు శిల్పకల్పితకళాసూక్ష్మంబులో లీనమై
నీ విశ్వాపకశక్తి నిండియుండదెటు? నిన్నే నమ్మికనై మ్రొక్కుచున్
సేవింతున్ భవదీయమూర్తిని మహా శ్రీ రాజరాజేశ్వరా

కవి స్తుతి

తొలుతన్ వేములవాడ భీమకవి నెం
తున్, పోతనామాత్యునిన్
దలతున్, భక్తి కవిత్రయంబును మదిన్
ధ్యానింతు, శ్రీనాథునిన్
గొలతున్, సోము నుతించెదన్, పొగడెదన్
గోపన్న వేమన్నలన్,
చెలువారన్ బ్రణుతింతు పూర్వకవులన్
శ్రీ రాజరాజేశ్వరా!

వినుతిన్జేయుదు రాట్కవిన్, గొలిచెదన్
వేదాంత విద్వత్కవిన్
గణుతిన్జేయుదు విశ్వనాథను, దివా
కర్లన్ స్తుతింతున్, మనం
బున దోకూరి కవీశ్వరున్ దలచెదన్
పోకూరి కాశీపతిన్
నెనరున్బూని స్మరింతునెప్పుడు మదిన్
శ్రీ రాజరాజేశ్వరా!



శ్రీ ర స్తు

శ్రీరాజరాజేశ్వరాయనమః

శ్రీ రాజరాజేశ్వర శతకము.

శ్రీ మౌనిస్తుత యుష్మదంఘ్రి యుగళిన్
సేవింతు లోకైక సం
క్షేమార్థంబు జగత్కుటుంబి వగుటన్
జేకూర్చు మశ్రాంత ము
ద్దామశ్రేయము సర్వ మానవులకున్
దాక్షిణ్య మేపారగన్
శ్రీమద్వేములవాడ దివ్యసదనా!
శ్రీ రాజరాజేశ్వరా! 1

జయ గౌరీప్రియ! భక్త హృన్నిలయ!
విశ్వశ్రేయ భవ్యాశయా!
జయకారుణ్య రసప్రపూర్ణ హృదయా!
సద్ధర్మ రక్షాక్రియా!
జయగోరాజహయా! సుధీచయ! జగత్
సామ్రాజ్య భాగ్యోదయా!
ప్రియమొప్పన్ పిరులిచ్చి ప్రోవ సదయా!
శ్రీ రాజరాజేశ్వరా! 2

శ్రీ గౌరీరమణీవరా! త్రిభువన
శ్రీరాజ్య లక్ష్మీధరా!
యోగిస్వాంత సరోరుహాంతర చరా!
ప్రోద్యద్దయా సాగరా!
జై గైర్వాణ సముద్ధురా! శుభకరా!
జై దోష నాశంకరా
శ్రీ గంగాధర! కావవే! హరహరా!
శ్రీ రాజరాజేశ్వరా! 3

ఓ గంగాధర! ఓ సుధాకరధరా!
ఓ సర్వలోకేశ్వరా!
ఓ గౌరీవర! ఓ రమాధవశరా!
ఓ భక్తహృన్మందిరా!
ఓ గంభీర దయాకరా! శుభకరా!
ఓ దోష నాశంకరా!
శ్రీగూర్పంగదె నీకు మ్రొక్కెద హరా!
శ్రీ రాజరాజేశ్వరా! 4

విను వర్ణింపగ వెయ్యినోళ్ల ఫణికే
విక్కంబుగా చేతగా
దణుమాత్రంబిక నొక్కనోరుగల
నాకౌనెట్లు నిన్‌గూర్చి వ
ర్ణనసేయన్ ద్రిగజత్ప్రభూ! కరుణతో
నా స్తోత్రమాలించి కూ
ర్మిని నన్నేలు కావంగదయ్య వరదా!
శ్రీ రాజరాజేశ్వరా! 5

గంగా నిర్ఝరిణీధరా ! శుభకరా !

కారుణ్య రత్నాకరా !

శృంగారేందుధరా ! జగత్ప్రభువరా !

చిత్రాంబరా ! నీకు సా

ష్టాంగంబొప్ప నమస్కరించి మది

విన్నశ్రాంతమున్ గొల్తు న

ర్థింగాపాతుము భక్తపాలనధురా !

శ్రీ రాజరాజేశ్వరా ! 6

పదముల్ సోలవు నీ పదాల్గొలువ

భావంబంతకున్ జాలదిం

పొదవన్ని మహిమోన్నతుల్వొగడ

శంభూ ! యెట్లువర్ణింతు నిన్

జదువుల్ నేర్వగలేదు నీ పదసరో

జశ్రీలపై వ్రాలి చే

వెద నీసంస్తుతి దివ్యగాన మశినై

శ్రీ రాజరాజేశ్వరా ! 7

రవి భాస్వత్కిరణంబులున్ విమల
తారాపుంజముల్ వర్ష బిం
దువులున్ లెక్కిడ వీలుకాని గతి
నిర్దోషాంచితంబైన సం
స్తవనీయంబగు నీ గుణంబులును
సాధ్యంబౌనె లెక్కింపగన్
శివః గౌరీధవః శేశవార్చిత పదా।
శ్రీ రాజరాజేశ్వరా 8

రాజుల్ రాజ్య విహీనులైరి కవులన్
రంజింప పోషింప నా
రోజుల్ బోయెనటంచు చింతిలను
ముల్లోకాలకీవే మహా
రాజగ్రామణివైన విన్నపమున్
ప్రార్థించెదన్ నాకు సు
శ్రీ జెన్నొంద నొసంగి ప్రోవగదవే
శ్రీ రాజరాజేశ్వరా ః 9

రాజుల్ భోజులు బూజు వట్టుదురు
సామ్రాజ్యాధి కారంబులే
రోజున్ శాశ్వత మొందజాలక
వినిర్మూలించు నౌరా! భవ
త్ప్రాజన్యోద్భవమై తవర్చు జగతీ
సామ్రాజ్యమో శాశ్వత
శ్రీజానొందుచు నుండుగా హరహరా!
శ్రీ రాజరాజేశ్వరా! 10

నీ సంకల్పము లేక వెల్వడకుగా
నిక్కంబుగా నేదియున్
నీ సంకల్పమె కారణంబగుటచే
నేత్రాయు పౌత్రంబునన్
దోసంబుండిన నా పయిన్ గరుణ
నిర్దోషంబు గావించి తం
డ్రీ! సౌరొందగ జేయుమీకృతి నిలన్
శ్రీ రాజరాజేశ్వరా! 11

చక్షుః శ్రోత మనంబు లుల్లసిల

విశ్వశ్రీ ప్రదీపంబులై

నీక్షేత్రంబు పతాక తోరణ సుమా

నీకాది దృశ్యాలతో

సుక్షేమంకర వేద ఘోషములతో

శోభిల్లు వాద్యాలతో

నిక్షేపంబుగఁ గ్రాలుచుంతు నెప్పుడున్

శ్రీ రాజరాజేశ్వరా! 12

అదె గంగానది ధర్మకుండమయి

దోషౌఘాల క్షాళించు చు

న్నది యిచ్చోట నటంచు నార్యులన

విన్నాడన్ యదార్థంబు గా

దది నీదివ్య కృపాతరంగిణియె

యిట్లాకుండమై వర్ధిలెన్

పృథివిన్ భక్తుల పాప పంకముడుపన్

శ్రీ రాజరాజేశ్వరా! 13

రోగుల్ మూగలు గ్రుడ్డివారలు
భయార్తుల్ నీదుసాన్నిధ్యమం
దో గంగాధర! కావవే! శరణు శంభో!
యంచు ప్రార్థింప నీ
రాగాంభోదము ధారతై కురిసి
ప్రారబ్ధాగ్ని చల్లార్చి తం
డ్రీ! గాసిల్లుట మాన్పి పంపెదవుగా
శ్రీ రాజరాజేశ్వరా! 14

ఒక పార్శ్వమ్మున ఆడురూపమయి
చెల్వొప్పన్ విలోకింప వే
రొక పంకన్ బురుషాకృతిన్ వెలసి
తోహో! సర్వలోకాల కీ
వొకడే తల్లివి దండ్రివై తనర నేమో
అర్ధనారీత్వమో
ర్చి కృపన్ దాల్చితివో జగత్ప్రభువరా!
శ్రీ రాజరాజేశ్వరా! 15

అవనిన్ నీవలె దైవమెందునను
లేడంచర్థ నారీశ్వరుం
డవటంచున్ దలిదండ్రి నీవె యని
వేడ్కన్ నమ్మి నిన్నొక్కవిన్
స్తవమున్ జేసెద పార్వతీశుల నొగిన్
సంతృప్తులన్ జేయు న
చ్చివ మార్గమ్మిది యంచు బ్రోవగదవే
శ్రీ రాజరాజేశ్వరా ! 18

భవదాద్యంతములన్ గనుంగొనుటకై
బ్రహ్మాచ్యుతుల్ పూర్వ మె
న్ని విధాలన్ బడికొట్టుకున్న వశమున్
జీమంత కాదయ్యె మా
నవ మాత్రుండను నీదు మూలమెరుగన్
నాకెట్లు సాధ్యంబగున్
శివః గౌరీధవః కేశవార్చిత పదా,
శ్రీ రాజరాజేశ్వరా ! 19

హరి వక్షంబున లక్ష్మికిన్, వలువ
జిహ్వన్ వాణికిన్, స్థాన బం
ధుర మర్యాద నొసంగ నీవు సగ మే
మన్ గౌరికిన్ స్త్రీ సమ
త్వరమాప్తై తవమొప్ప నిచ్చితివి వా
హ్వా! నిన్ను బోల్దేవు డీ
స్థిరనెవ్వండు దలంచి చూడగ హరా!
శ్రీ రాజరాజేశ్వరా! 16

అతి సౌందర్య తనూ విలాసుడును
నిత్యానందు డంచెంచి యె
వ్వతె యైనన్ వరియించునేమొయని
సంభావించి యెవ్వేళ (బా
ర్వతి యర్థాంగము నాక్రమించుటయు
దేవా! అర్ధనారీశ్వరా
కృతి వింపారగ దాల్చినాడవు గదా!
శ్రీ రాజరాజేశ్వరా! 17

మును త్రేతాయుగమందు రాఘవుడు నిన్
బూజించి కష్టాబ్ధి నీ
దెను నీదివ్యకృపా సహాయమున త
ద్రీతిన్ భవాంభోనిధిన్
నిను సేవించి తరింప నెంచితిని తండ్రీ!
మాకు నీకన్న మిం
చిన దేవుండెవడెంచి చూడఁబుడమిన్
శ్రీ రాజరాజేశ్వరా! 20

అరి సంహారమొనర్ప జాలు నొక
దివ్యాస్త్రంబు నీయంగ శ్రీ
హరిచే గాక కదా కిరీటి నిను
సంప్రార్థించి మున్ శత్రుభీ
కరమౌ పాశుపతాస్త్రమున్ బడసె
నీకన్నన్ మహాదేవు డీ
స్థిర వెవ్వండయ! ఆశ్రితావన దయా!
శ్రీ రాజరాజేశ్వరా! 21

క్షీరాబ్ధిన్ దరచన్ జనించిన మహా
క్ష్వేళంబునున్ ద్రావి దు
ర్వారాపద్దవ వహ్నిమాపి సురలన్
రక్షించితౌ నేడు సం
సారాంభోధి జనించు కష్ట విష
మాస్వాదించి నిత్యంబు తం
ద్రీ! రక్షింపవదేల మమ్ము దయతో
శ్రీ రాజరాజేశ్వరా 22

స్వామీ! నీపయి నిండు భక్తి
నరిషడ్వర్గాదులన్ నిత్యమున్
సామర్థ్యంబున గెల్చు శక్తి భవబం
ధక్లేశముల్ ద్రుంచి ని
త్యామోదంబును గూర్పుయుక్తి నిరతం
బవ్యాజ భూతోత్కర
ప్రేమాసక్తి నొసంగి ప్రోవగదవే!
శ్రీ రాజరాజేశ్వరా ! 23

పరమార్థంబనిశంబు గోరుకొను మత్
స్వాంతాగ్ర కాసార మం
దరయన్ భక్తి యనందనర్ఘ్య కమలం
బావిర్భవించెన్ దదం
బురహంబున్ గొని తావకాంఘ్రి యుగళిన్
బూజింతు నాసక్తి నన్
చిరకారుణ్యము తోడఁ బ్రోవగదవే ।
శ్రీ రాజరాజేశ్వరా । 24

ప్రాజాపత్యము యౌవనంబు తనువున్
ద్రవ్యంబనిత్యంబు లౌ
సౌజన్యాకరమై తనర్చెడు భవత్
సాయుజ్యమే శాశ్వతం
బై జానొందు నటంచు నార్యులనఁగా
నాలించితిన్ గావునన్
జేజేల్ జేసెద దాని గూర్పగదవె ।
శ్రీ రాజరాజేశ్వరా । 25

భవదీయాంఘ్రి సరోరుహామృతము

నాస్వాదించు నెవ్వండు వా

డవనిన్ పాపరుజా విముక్తుడయి

బ్రహ్మానందమున్ జెంది సం

స్తవనీయంబగు మోక్ష మార్గమును

గాంచన్ జాలు నంచెంతు నో

శివ! మృత్యుంజయ! భక్త చిత్త నిలయా!

శ్రీ రాజరాజేశ్వరా! 26

సర్వ వ్యాప్తిని బొంది కన్పడక

రక్షన్ జేయు వాయుక్రమన్

సర్వంబీవయి గోచరించకయె

విశ్వంబెల్ల పాలింపఁగా

సర్వావస్థల సర్వవేళల భవత్

సౌజన్య కారుణ్యముల్

గీర్వాణస్తుత! పొంగిపొర్లును గదా!

శ్రీ రాజరాజేశ్వరా! 27

సకల ప్రాణులు సర్వకాలముల
విశ్వంబందున న్నిదు ప్రే
మకు పాత్రమ్ములదెట్టు లన్నను
మహాత్మా! రాతిలోనుండు క
ప్పకె నీర్వెట్టిన సత్కృపానిధివి
నీ పాదాబ్జముల్ గొల్చు వా
రికి దిక్కెందుకు చూపకుందువు శివా!
శ్రీ రాజరాజేశ్వరా! 28

జననమ్మొందక ముందె బిడ్డ కొఱకై
స్తన్యంబులన్ దల్లికిన్
దనరన్ గూర్చిన ప్రేమ పూర్ణుడవు
నీ దాసానదాసుండ న
న్ననయం బేలుకొనంగ నీకు దయలే
దా నాపయిన్ లేక పే
ర్మిని నన్నేలుకొనంగ భారమగునా?
శ్రీ రాజరాజేశ్వరా! 29

పాలన్ ముంచిన నీట ముంచిన ప్రభూ !
భారంబు నీదంచు నీ
పాలన్ జేరినవాడ నన్ను దయతో
పాలింప రాకున్న నా
కీ లోకంబున నీవుగాక పెరవా
రెవ్వారలున్నారలో !
శ్రీ లక్ష్మీ రమణార్చితాంఘ్రియుగళా !
శ్రీ రాజరాజేశ్వరా ! 30

నిన్నే తల్లిగ దండ్రిగా గురునిగా
నే నమ్మికొన్నందుకున్
నన్నేలన్ దలపోయవైతి విది
యన్యాయంబగున్ గాదె ? ఆ
పన్నుండన్ దయనేలకున్న నిఁక
నెవ్వారేలు వారన్న ! కూ
ర్మిన్నన్నేవేగ కృతార్థు జేయగదవే !
శ్రీ రాజరాజేశ్వరా ! 31

కై మోడ్పుల్ ఘటియించి నీ చరణ
యుగ్మశ్రీలపై వ్రాలి నీ
నామ స్తోత్రము జేయువాడను మదిన్
శంభూ! మహాదేవ! న
న్నే మార్గంబున నేలుకొందువొకో
నాకీవే గదా దిక్కు శం
కరీ! మృత్యుంజయ! దీనపాలనదయా!
శ్రీ రాజరాజేశ్వరా! 32

విరుపేదన్ శిథిలంబు నాగృహము
తంత్రీ! జీవితంబెన్న సా
గరమై యొప్పును దానియందు గల
పంకంబందె పంకేజముల్
విరియన్ బూచెను నీదు పూజకయి
సంప్రీతిన్ గటాక్షించి నా
చిరు కాన్కల్ గయికొమ్ము వేగమె ప్రభూ!
శ్రీ రాజరాజేశ్వరా! 33

గుండెల్ దల్లడ మొందగా నురిమి
చక్షుల్వింద వర్షించి హృ
త్ఖండక్షేత్ర విషాద దాహమిసుమంతన్
దీర్చలేకుండె నీ
యంతన్ జేరితి నీకృపామృతరసం
బక్రాంతమున్ జిల్కి పే
ర్మిందెందబున్ దృప్తి జేయగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 34

వెతలం బొందుచు నుండుచున్ హృదయ
మన్వేషించు శాంతి ప్రస
న్నతకై కావి లభించదాయె
వికనైనన్ ప్రేమతో నన్ను వి
స్తృత సంసార పయోధిఁదేల్చుచు సదా
స్వేచ్ఛా విహారమ్ముగా
ధృతిమీరన్ బ్రతుకంగ జేయగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 35

"శరశరణా! శరణంటి బ్రోవు" మని
మార్కండేయు డర్థింప స
త్కరుణన్ బ్రోచితి వందు రార్యులిది
సత్యంబౌనె? విన్గొల్చు నీ
శరణార్థిన్ ననుగావ వెందులకు
దోషంబేమి కావించితిన్
చిర కారుణ్య రసప్రపూర్ణ హృదయా!
శ్రీ రాజరాజేశ్వరా! 36

ధవదర్థంబు కుబేరు నొక్కనికె
సంప్రాప్తింపగా జేసినా
దవు నాకేమిడినాఁడ వేమ తమ
బిడ్డన్ గానె? నా తండ్రి! నా
కవనిన్ పీపదధూళి నిచ్చినను
బ్రహ్మానందమున్ జెందనే
శివ! వన్నేటికి చిన్నబుచ్చెదవయా!
శ్రీ రాజరాజేశ్వరా! 37

కయిమోడ్పుల్ ఘటియించి నిన్ గొలుచునన్
గష్టాబ్ధిఁదాటించగన్
దయరాదయ్యెను నీకు నాపయిని
నీ దాసాన దాసుండ ని
ర్దయ నాపైతగునా దయార్ద్రి హృదయా!
రక్షింపవే పార్వతీ
ప్రియా! భవ్యాశయా! భక్తచిత్త నిలయా!
శ్రీ రాజరాజేశ్వరా! 38

పలుమార్లెంతగ నోరు నొవ్వగను
దేవా! యంచునిన్ బిల్చినన్
పలుకే బంగరమాయె నీ ఘనతకున్
భంగంబు వాటిల్లునో
అలుకన్ బూవితో! మారు పల్కవు
మహేశా! దోషమేమైన వ
ర్తిలెనో నాయెడలన్ క్షమించ వలదా!
శ్రీ రాజరాజేశ్వరా! 39

మా మూర్ఖచ్చేద విష్టసిద్ధికయి
మర్మంబేల నీతోడ దు
ర్వ్యామోహంబున పాపముల్ సలిపి
పుణ్యప్రాప్తికై మ్రొక్కెదన్
నా మౌఢ్యంబున కెంత నవ్వకొనెదో!
నాలోవి దోషాలు తం
డ్రీ! మన్నించి వివేక మీయగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 40

స్వామీ! తప్పొనరించ తండ్రి తనయున్
బావిన్ బడన్ ద్రోయునే?
వ్యామోహంబున దోషముల్ సలుప
కష్టాంభోనిధిన్ ద్రోతువే!
నే మూఢాత్ముఁడఁగల్మషాత్ముఁడను
తండ్రీ నన్ను మన్నింపవే!
శ్రీమద్వేములవాడ మందిర వరా!
శ్రీ రాజరాజేశ్వరా! 41

జగముల్ సేయగనేల? చేసితివిబో
సంసార పాశంబుతో
బిగియన్ గట్టగనేల? కట్టితివిబో
విజ్ఞానలోపంబు సే
యగనేలా? ఇదినీకు న్యాయమగునే?
అజ్ఞానమున్ బాపి వా
సిగ సుజ్ఞానము గూర్చి ప్రోవగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 42

పాలున్ బోసియు బెంచినంగ లచు
సర్పాలన్ ధరించన్ ప్రియం
బేలాగయ్యె? విషంబు మ్రింగగ
మనంబెట్లొప్పె? నారీతిగా
నాలో గల్గిన పాపహాలహాల
మూనన్ ప్రీతి చిత్తాన యే
లీలన్ లేదొకో! ఆశ్రితావన దయా!
శ్రీ రాజరాజేశ్వరా! 43

హిమవంతంబున శీత బాధ జడలే
కే వ్యాఘ్ర మత్తేభ చ
ర్మము లెన్నేవియు గప్పుకొన్న చలికా
రా! తట్టుకోనీకు సా
ధ్యమే? నా వెచ్చని గుండెలోపలను నీ
కత్యంతరంబేమి? పే
రిమితోడన్ వసియింపు చుండగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 44

క్షమ క్షోభిత లోకమందిపుడు
భిక్షంబెత్త నీకెట్లగున్
స్వామీ! నాయెద బీడు వడ్డయది
నీబల్ కోదెకున్ జోడుగా
వ్యామోహంబను కోడెవిచ్చేదను
నేద్యంబీవు సాగించుకో
క్షేమంబౌనుభయత్ర భక్త వరదా!
శ్రీ రాజరాజేశ్వరా! 45

ఎదదేనాటికి పూయకుండుటను
స్వామీ! రిక్తహస్తాల నీ
గుడికేతెంచితి పొగిలంబడి త్వ
దంఘ్రుల్ బట్టుకొన్నాడ ప్రే
ముడితో నన్ను కృతార్థుఁజేయుము
స్వయంభూ! శంఖులింగప్రభూ!
దృఢభక్తిన్ వినుగొల్తు మానసవిభూ!
శ్రీ రాజరాజేశ్వరా! 46

కదు కౌతూహలమూని విక్కముగ నా
కండ్లార విన్గాంచ నీ
గుడికేతెంచి త్వదీయమూర్తిగని
మ్రొక్కుల్ నీకు నర్పించు న
ప్పుడు నాకన్నులమోద బాష్పజలముల్
పొంగువ్ దదీయాంబువుల్
చెడిపోనట్లభిషేక మూన్పవియ వే,
శ్రీ రాజరాజేశ్వరా! 47

మదిలేకే చనుదెంచినాడను ప్రభూ !
మన్నింతువానన్ను ! నీ
గుడికేతెంచితి రిక్తహస్తముల నన్
గూర్మిన్ గటాక్షింతువా !
యెదదే నీ గుడి దారిలో వెఱయు వి
న్నేరీతి సేవించుటో
మృడ ! నా కయ్యది దెల్పి ప్రోవగదవే !
శ్రీ రాజరాజేశ్వరా ! 48

దేవా ! అల్పుడ నిన్ను నేబొగడ
శక్తిన్ జాలమిన్ వేదనా
భావాంభోధము ధారలై కురిసి
సద్భక్తిన్ భవద్దివ్య తే
జోవంతంబగు పాదముల్ గడుగ
చక్షుల్ వింపునే కాని తం
ద్రీ ! విశ్వేశ ! కదల్పలేను పెదవిన్
శ్రీ రాజరాజేశ్వరా ! 49

నదులెల్లన్ జనియించి నీరధిని
లీనంబైన చందంబు నీ
పద సాన్నిధ్యము జేరు మార్గమునె
జూపన్ పెక్కు ధర్మంబు లిం
పొదవన్ బుట్టె నదేదియైన నిను
దివ్యున్ జేరనౌనంచు నెం
చెదనో వేములవాడ మందిరవరా!
శ్రీ రాజరాజేశ్వరా! 50

అరయన్ గాచిన పాలమీగడలు
రుచ్యంబౌనటే? ఖండశ
ర్కరపై ప్రీతి జనించునే? అమృతమే
ప్రాప్తించినన్ దాని మా
ధురిపై మక్కువ పుట్టునే? అభవ!
నీ స్తోత్రామృతాస్వాదియై
చిర సమ్మోదము నొందు జిహ్వకు హరా!
శ్రీ రాజరాజేశ్వరా! 51

జయ భాగ్యోదయా! శత్రుగోవరహయా,
సద్భక్త చిత్తాలయా!
నయ సమ్యక్క్రియా! శత్రులోక విలయా,
నానార్త రక్షాభయా!
భయశోకవ్యయా! నిష్కళంక హృదయా,
భవ్యాశయా! పార్వతీ
ప్రియా! సన్మౌలుమయా! శ్రితావనదయా!
శ్రీ రాజరాజేశ్వరా! 52

శిరమందున్ మకుటంబుగా శశి విరా
జిల్లంగ నూరుస్థలిన్
గర మర్థిన్ గణనాథుఁడింపలర వే
డ్కన్ వామ భాగంబునన్
సరసాలాపము లాడుచున్ గిరిజ భా
స్వల్లీల విర్తిల్ల సు
స్థిర ప్రేమన్ గనుపింపవే గొలిచెదన్
శ్రీ రాజరాజేశ్వరా! 53

పులి తోలు గట్టి కరంబునందు మహితం
బున్ బట్టి కంఠాన పా
ములు వింపారగ జుట్టి మేనభసితం
బున్ బూసికొన్నట్టి నిన్
దిలకింపన్ దలపెట్టి నిత్యమును ప్రీ
తిన్ గొల్తు గాబట్టి భా
సిల జూపట్టి ముదంబు గూర్పగదవే।
శ్రీ రాజరాజేశ్వరా ! 54

ఎంతో దూరము నందుమున్న రవి
ఈడే కాంతిఁదానంత యెం
తెంతో దూరము నీకు వాకయిన
తండ్రీ ! జ్ఞాన సత్కాంతి మత్
స్వాంతంబందున భాసిలన్ నలిపి
యజ్ఞానాంధకారంబు నా
చింతల్ దీరగ బాయజేయ గదవే।
శ్రీ రాజరాజేశ్వరా ! 55

గదిలో చీకటి క్రమ్ముకున్నటుల
　　　　　నజ్ఞానాంధ కారంబు నా
యెదలో నంతట నిండి యుండెనిక
　　　　　స్వామీ ! అంధకారంబు బా
పెద పంచున్నెర నమ్మి యుంటినిగదా !
　　　　　విజ్ఞాన దీపంబు నా
హృదయం బిందు వెలుంగ జేయగదవే !
　　　　　శ్రీ రాజరాజేశ్వరా ! 56

జ్ఞానం బించుక లేని నేను నిను
　　　　　గాంచన్ శక్య మెట్లౌను? సు
జ్ఞానంబున్ దయజేసి నిన్ను గను
　　　　　భాగ్యంబున్ ప్రసాదింపవే !
మౌనంబూనెదు మన్నుహొన్నగు నటుల్
　　　　　మార్పన్ సమర్థుండవ
క్షీణ ప్రాభవ ధుర్య ! నమ్మితిని నిన్
　　　　　శ్రీ రాజరాజేశ్వరా ! 57

స్వామీ ! నీవె శరణ్యమంచు మది
సంభావించి దైన్యంబుతో
నామూర్ధంబు భవత్పదాబ్జములం
దానన్ మోపి బాష్పాంబు ధా
రా మాలిన్య మొనర్పువాఁడ నని
బల్ శంకింతి కవ్వింపవా !
ప్రేమాపూర్ణున కిట్టి శంక తగునా !
శ్రీ రాజరాజేశ్వరా ! 58

ఈవా ! ధాత్రిన గోచరుండ విఁక
విన్నేలీల సేవింతు నో
దేవా ! నేనొక యల్ప మానవుఁడ
సందేహాత్ముఁడన్ మూర్ఖుడన్
రావే ! దర్శనమీయవే వరములన్
ప్రాప్తింపగా జేయవే !
సేవింతున్ భవదీయ పాదయుగళిన్
శ్రీ రాజరాజేశ్వరా ! 59

నీవేమో కనరాక పోతివింక
తంత్రీ, మాకు దిక్కెవరు ? నీ
నీ విశ్వంబున నిండియుంట నిజ
మౌనేన్ విశ్వమే నీవుగా
భావింపం దగుగాన విశ్వజన
సేవా ధర్మమున్ నిల్పి నీ
సేవా భాగ్యమొసంగి ప్రోవు మనవిన్
శ్రీ రాజరాజేశ్వరా ! 60

కనలేరితిగఁ జూడగల్గను నిరా
కారుండవౌ నిన్ను ? నా
మనమందున్ గల కోర్కె దీరగను
సూక్ష్మజ్ఞాన నేత్రంబు లి
చ్చిన మోదంబున నిన్నుగాంచి సతమున్
సేవించెదన్ నిందు కూ
ర్మిని నీదర్శన భాగ్యమీయగదవే !
శ్రీ రాజరాజేశ్వరా ! 61

"దురహంకారులకేను గన్పడిన
నాతో గూడి తిఱుగుచు కొం
దరు ఛాయా పటమంచు" గన్పడవు
మాతో నుంట నామోషియో
పరె! నీ వేరికి గానుపించకను
మా స్వాంతంబులందాగి సు
స్థిర వాసంబొనరింపు చాలనదియే
శ్రీ రాజరాజేశ్వరా! 62

నీవే విశ్వము విశ్వమంతయును
నీవే కాన ఈదివ్య తే
జో వంతంబగు శిల్పికల్పిత కళా
సూక్ష్మంబులో లీనమై
నీ విశ్వాకృతి నిండియుండదెటు?
విన్నే నమ్మికై మోడ్పుచున్
సేవింతున్ భవదీయ మూర్తిని హరా!
శ్రీ రాజరాజేశ్వరా! 63

నీవే తోడువు నీడవంచు మదిలో
నే నమ్మియున్నాడ నన్
గావన్ దర్శన మీయవైతి ఏఁక
ఈ కాయంబు నిత్యంబుగా
భావింపందగదాయె నిగ్గను మహా
భాగ్యంబు నీ జన్మలో
శ్రీ విశ్వేశ్వర నాకు గూర్పగదవే !
శ్రీ రాజరాజేశ్వరా ! 64

ప్రాపెల్లప్పుడు నాకునీవెయని సం
భావించి సద్భక్తితో
నీపై పద్యములెన్ని వ్రాసిన కృపన్
నీ వాక్కుమారైన న
న్నాపన్నున్ దయఁబ్రోవ గన్పడవు
న్యాయంబౌనె ? నాయందిటుల్
శ్రీ పురారి ! పరాకు సేయతగునా !
శ్రీ రాజరాజేశ్వరా ! 65

భూమిన్ నే గనుపించగా జనులు
గుంపుల్ గూడి విచ్చేసి ఏ
మేమో కోర్కెలు కోరుచుందురవి
నీ వీ లీల గావించవా ?
స్వామీ ! కన్పడకున్న వీడనిక నే
సత్యాగ్రహం బూనెదన్
ప్రేమన్ దర్శనమిచ్చి ప్రోవగదవే !
శ్రీ రాజరాజేశ్వరా ! 66

స్వామీ ! నీవొకవేళ గన్పడినచో
శంభూ ! స్వయంభూ ! ప్రభూ !
వేములవాడ పురీవిభూ ! శరణమీవే
యంచు వేమారు తం
డ్రీ ! మోదాశ్రు జలంబులన్ గడిగెదన్
నీపాద పద్మంబులన్
ప్రేమన్ దర్శనమిచ్చి ప్రోవగదవే!
శ్రీ రాజరాజేశ్వరా ! 67

ఈ విశ్వంబున నిండియున్న ఘను
నిన్నే మాత్ర మెఱుఁగని నే
నేవేళన్ గవనైతి నజ్ఞుడను
నింకేరీతి నిన్‌జూతు దే
వా ! విశ్వేశ్వరు నిన్ను గాంచుటకునై
స్వాంతంబు కాంక్షించె నా
సేవల్ గైకొని దర్శనంబిడగదే !
శ్రీ రాజరాజేశ్వరా ! 68

కలికాలంబిది నీవు గన్పడనిచో
గారీపడున్నట్లు లో
కులు సుంతైనను నమ్మజాలరు ప్రభూ !
కోపించకీమాటకున్
వెలుగే లేనపుడెట్లు నమ్మనగు
సూర్యున్ సూర్యుఁడున్నట్లు బా
పిల గాన్పించిన శంక వైదొలగదే !
శ్రీ రాజరాజేశ్వరా ! 69

నను గష్టాబ్ధి తరింపజేయుమనినన్
నానా విధాలన్ స్తుతిం
చిన నన్నోమక మౌన మూనెదవు తం
డ్రీ ! నీకు న్యాయంబదే !
జనకుండాత్మజు కష్టముల్ గని తరిం
చన్ గల్గునే ? నన్ను కూ
ర్మిని గావన్ దడవేల జేసెదు ప్రభూ !
శ్రీ రాజరాజేశ్వరా! 70

విశ్వంబేక కుటుంబమై వెలయుచున్
విశ్వప్రజల్ సర్వదా
విశ్వప్రేమకు తావలంబగుచు
నుర్వింగాంచఁదోబుట్టులై
విశ్వాసం బెడదన్ దలించి నెగడన్
ఃజ్ఞానమ్మై వర్ధిలన్
విశ్వశ్రేయము గూర్చి ప్రోవు మనవిన్
శ్రీ రాజరాజేశ్వరా ! 71

స్వామి ! నీ మహిమోన్నతుల్ ప్రకటమౌ
చందంబునన్ నేటి యీ
జామకోక దవాగ్నులార్పగ సుఖీ
భంబేర్పడన్ లోక సం
క్షేమార్థంబు భవత్కృపామృత రస
శ్రీ వృష్టి వర్షింపవే
శ్రీ మద్వేములవాడ మందిరవరా !
శ్రీ రాజరాజేశ్వరా ! 72

క్షీరాంభోనిధి నుద్భవించిన సిరిన్
జేపట్టెనే కాని దు
ర్వారక్ష్వేళము వంటగా గలిగెనే
పద్మాక్షు డొక్కింతయే
నౌరా ! చేదు హరించి లోకముల
ప్రేమాసక్తి రక్షింప గా
రీ రామాధిప ! నీకె చెల్లెను గదా !
శ్రీ రాజరాజేశ్వరా ! 73

ఏమో యింత విషంబు మ్రింగుట ఘనం
బెట్లానొకో ! యిప్పుడీ
కామక్రోధ మదప్రలోభ దుర హం
కార ప్రపంచైక సం
గ్రామాణ్వస్త్రి మహాహలాహలము మ్రిం
గన్ జాలుచో మాకు నీ
స్తేమా స్తోమతలర్థమౌను గిరిశా !
శ్రీ రాజరాజేశ్వరా ! 74

కొండపై నీ వెసగన్ పతీ సుతులతో
గూర్చుండి యున్నప్పు డిం
పలరన్ గోవర సింహ మూషక శిఖి
వ్యాళంబులున్ మీ కడన్
చెలిమిన్ వర్తిల జేసినట్లు జనులన్
స్నేహంబునన్ ధాత్రి వ
ర్తిలఁ జేయంగదె కేశవార్చిత పదా !
శ్రీ రాజరాజేశ్వరా ! 75

సుకుమారున్ కుసుమాయుధున్ వలపురాజున్
భగ్గునం గాల్చి వం
దుకు లాభంబు హాళక్కి మానవుల యందున్
నేడు వ్యామోహమున్
వికటోన్మాద మదోత్కృష్టైక మదనున్
విధ్వంసమున్ జేసి ధా
ర్మికులన్ బ్రోచిన సార్థకంబగు హరా ।
శ్రీ రాజరాజేశ్వరా । 76

కుల వైరమ్ములతోడ గ్రుద్దుకొను
మూర్ఖుల్ సంఘ విధ్వంసకుల్
గలరంచున్ వినుమాట పాతబడి పోగా
నేడు పార్టీ కులా
లిల రేకెత్తెను శీల మే కులముగా
వృద్ధిన్ గనం జాలి బల్
జెలిమిన్ గూడి జనుల్ సుఖించు టెపుడో ।
శ్రీ రాజరాజేశ్వరా । 77

వరకట్నాల గిరాకి హెచ్చె. పదవీ
వ్యామోహమా రెచ్చె, సో
దర భావంబది చచ్చె, మానవత
విధ్వంసంబు గావచ్చె. దు
ర్భర దారిద్ర్యము జాతి నెల్లఁగబళిం
పంజొచ్చె. సామాన్య డీ
స్థిర సౌభాగ్య సుఖాప్తి దేలు టెపుడో ?
శ్రీ రాజరాజేశ్వరా ! 78

అరెరే ! అక్రమ నిక్రమంబున
స్వలాభార్జుల్ సిరుల్ మూట గ
ట్టిరి, పేదల్ నిరుపేదలైరి. కలయుండ్లే
శ్రీలతో నిండె. న
ల్గిరి మధ్యస్థులు సాంఘికార్థిక మహా
క్లేశంబులం జిక్కి. ఈ
స్థిర శోకార్తి దికెప్పు డీ అసమతల్
శ్రీ రాజరాజేశ్వరా ! 79

ఎట్లెట్లా ? పద వుల్ గడించుటకు
నోట్లీకున్న వోట్లీయరా ।
ఇట్లెట్లౌనోకొ ! విచ్చగాడవట నీ
వేమీక లోకేశుగా
నెట్లెట్లైతివొ ! తద్రహస్యము నొకిం
తేన్ దెల్పి మానందియాల్
సిట్లన్ గొట్టుచు జాడ జూపగదవే ।
శ్రీ రాజరాజేశ్వరా । 80

మతమంచున్ గితమంచు కొందరు మతో
న్మాదంబుతో నేడు దు
ర్మత కీలన్ రగులంగ జేయుచు కుతం
త్ర ప్రజ్ఞతోడన్ ప్రజా
హితమౌ శాంతి సుఖంబులన్ జెఱుతురిం
కీ ధాత్రిపై నీవు స
త్కృత మే సన్మతమంచు నేర్పగదవే ।
శ్రీ రాజరాజేశ్వరా । 81

ప్రకటింపన్ మదినొచ్చు నొక్కొ_కడు
ధర్మ ద్వేషియై శాంతి ఘా
తకుడై పాతకుడై దురాక్రమణ చిం
తాస్వాంతుడై ఘోర వం
చకుడై నాస్తికుడై స్వలాభ పరుడై
జ్ఞానాంధుడై భూత ధా
త్రికి భారంబిడు దాని మాన్ప గదవే।
శ్రీ రాజరాజేశ్వరా। 82

కొల్లం గొట్టుట కుత్ర పన్నుటయు
మూర్ఖం బున్నతోద్యోగమున్
జెల్లంబొందుట దంబుసూపుట ప్రజా
క్షేమాని కౌ ద్రవ్యమున్
దుల్లం జేయుట నోట్లు కోట్లిడుట
నేడున్ లోకులందెన్న వ
ర్థిల్లెన్ వాటి నడంచి ప్రోవుమవనిన్
శ్రీ రాజరాజేశ్వరా। 83

ఒకఁ డన్యాయము జేసి ముందువఁడు
వేరొక్కండు స్వార్థార్థియై
వికట ప్రక్రియలన్ స్వదేశమునె
దుర్భిక్షంబు గావించు నిం
కొకఁడు ర్వీస్థలి శాంతి భంగకరమౌ
యుద్ధాగ్నులన్ రేపు ధా
ర్మిక లోకంబుల గావుమయ్యా కృపతో
శ్రీ రాజరాజేశ్వరా ! 84

తలపన్ సంఘ విఘాత పాతక కుతం
త్ర స్వార్థ ఘాతాలు వ
ర్థిలఁ చున్ నీతి నడంచి పెట్టి అవి నీ
తిన్ బెంచి దౌర్జన్య కీ
లల శాంతిన్ బడద్రోసి న్యాయమును
నేలన్ గల్పి ధాత్రీ స్థలిన్
జెలరేగెన్ గరుణించి ప్రోవుమవనిన్
శ్రీ రాజరాజేశ్వరా! 85

పాలన్నీళ్ళను గల్పి విక్రయమొనర్చన్
పాపమంచెంచు న
త్కాలంబిప్పుడు మారిపోయినది
యీ కాలంబులో నీళ్ళలో
పాలంగల్పెడు నేర్పుతో నెగడు
వ్యాపారంబులున్ సాగ దు
శ్శీల ధ్వంస మొనర్చి ప్రోవుమవనిన్
శ్రీ రాజరాజేశ్వరా । 86

పాలం ద్రావుచు కండ్లు మూసికొని
యెవ్వాడిందు లేడంచు మా
ర్జాలం బెంచియు ప్రేటులన్ దినివ
లీలన్ పాపముల్ సల్పువా
రీ లోకంబున నెందరో కలరు
వి న్నేమాడ్కి కన్గప్పనౌ ॥
శ్రీ లక్ష్మీరమణార్చితాంఘ్రియుగళా ।
శ్రీ రాజరాజేశ్వరా । 87

కప్పన్ క్రమింగెడు పాము తాను తలపై
గ్రద్దన్ గనం జాలవ
ట్లిప్పట్లీ ధర దీనమానవ తతిన్ హిం
సించు దుష్టాళినీ
విప్పల్ గ్రక్కు లలాట నేత్రభయమే విన్
గాంచ లేరై రిగా
జెప్పంగా వశమే భవన్మహిమముల్
శ్రీ రాజరాజేశ్వరా । 88

కరుణా రాశి వసంతభూత తతి .
రక్షాదీక్ష బద్ధుండ వీ
స్థిరపై దీనుల వేచు దుష్టజనులన్
శిక్షించుచున్ సజ్జనో
త్కరమున్ రక్షణజేసి కూరిమి జగ
త్కల్యాణమున్ గూర్పవే ।
చిరభక్తిన్ వినుగొల్చెదన్ శుభకరా।
శ్రీ రాజరాజేశ్వరా । 89

కరియంచున్ కరిమోము వాఁగని
శంకన్ బూవి లంఘించు తే
పరి నాత్రంబున నావుఁ నీ వృథుల వా
తృల్యొ ప్రవాహంబు వి
ద్ధరరావిమ్మటురాక యుండిన ప్రభూః
దౌర్జన్య దావాగ్ని చె
చ్చెర దగ్ధంబొనరించు శాంతి వనమున్
శ్రీ రాజరాజేశ్వరా ! 90

అరెరేః పిచ్చుకమీద ఘోరమగు
బ్రహ్మాస్త్రప్రయోగంబటుల్
మరునన్యాయముగా దహించుటొక
సామర్థ్యంబె ఈనాడు మా
భరతోర్వింగల లేమిరక్కసిని
కాల్పంజాలినంగాని నీ
స్థిరసామర్థ్య మెఱుంగలేవు జగముత్
శ్రీ రాజరాజేశ్వరా ! 91

ఒకడుచ్ఛస్థితినొంద సీర్ష్యదన దే
మోమాట వోగొట్టుకు
న్నక్రియన్ మిక్కిలియేడ్వువింకొకఢు దై
న్యత్వంబునుం జెందవే
డుకగా పండ్లి కిలించుచున్ నగుచునుండున్
వాని శిక్షించి ధా
ర్మికమార్గంబున బెట్టుమో। హరహరా।
శ్రీ రాజరాజేశ్వరా ! 92

అపకారంబిసుమంతఁ జేయక
జలంబంబులకు మీనంబులన్
కపటోపాయముబన్ని జాలరులు
వీఁకన్ జంపు చందంబునన్
కుపథుల్ స్వార్థపరుల్ సుధీమణుల
కెగ్గున్ జేతురెల్లప్డు న
త్కృప శిష్టావనమీవె చేయగదవే।
శ్రీ రాజరాజేశ్వరా ! 93

సమవిప్రద్రోహమొనర్చినన్ దినకరున్
చండాంశుడంచౌక్కమా
రుమృగాంకున్ హిమధాముడంచు పలు
మారుల్ మ్రింగు గాముల్ విరో
ధములేకున్న దరిద్రమన్ గ్రహము
బాధల్ పెట్టు నెవ్వేళ నో
రిమి చిత్తంబుగ లారటంచు కవులన్
శ్రీ రాజరాజేశ్వరా! 94

ఫణి బల్పెక్క విషంబు వర్ధిలినటుల్
పాపాత్ము దైశ్వర్య మొం
దిన దుష్టత్వము రెచ్చిపోవు. గవి వృ
ద్ధిన్ జెంద క్షీరంబు హె
చ్చిన చందంబున పుణ్యవంతుడు సిరుల్
జెన్నొంది వర్ధిల్ల ధా
త్రిని సత్కర్మలు దండిగా సలుపడే!
శ్రీ రాజరాజేశ్వరా! 95

అకటా! పాపి సుఖించగా సుకృతి
దైన్యంబొందె నోరువ్వ వా
నికె ఊర్వీరుల దక్కె పండితుడు
గానీ నోరులేకున్న గ
వ్వకునైనన్ గొరగాకపోయె వింక
దేవా! న్యాయమున్‌గూర్చి ధా
ర్మిక లోకంబును సంతరింపగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 96

మరువిన్ గాల్చితివన్న మాటవిని
నమ్మం జాలకున్నాడ నీ
హరువున్‌గాంచి వహించలేక మరుదే
అట్లౌట నీర్ష్యాగ్నికిన్
పరమేశా! నవమన్మథాకృతునిగా
వానిన్ గటాక్షించి సు
స్థిర దాక్షిణ్యము జూపినాడవుగదా!
శ్రీ రాజరాజేశ్వరా! 97

కలలో గన్పడు భోగభాగ్యములు
నిక్కంబౌనె? తద్రీతిగా
విలలో సంపదలెన్నిగల్గిన స్థిరంబే?
జీవితాంతాన ని
శ్చలమైనట్టి పరార్థమొక్కటి దయన్
సంప్రాప్తమున్ జేసి య
ర్మిలి రక్షింపవె! కేశవార్చిత పదా,
శ్రీ రాజరాజేశ్వరా ! 88

నీవే దేవుడ వీవెరక్షకుడ
వీవే ప్రాపు నాకంచు ని
న్నే వర్ణింప సమస్తమబ్బునని యెం
తేన్నమ్మి పేరాశతో
నీ వాత్సల్యము నొంద నీ శతకమున్
నేవ్రాసితిన్ గావి తం
డ్రీ! వాగ్ప్రౌఢిమ నీకు జూపుటగునా?
శ్రీ రాజరాజేశ్వరా! 89

స్వామీ! నీవె శరణ్యమంచు మదిలో
భావించి కైమోడ్పితిన్
కామక్రోధ మదప్రలోభ రిపు వర్గ
ధ్వంసమున్ జేసి వ
న్నే మార్గంబున నేలుకొందువో దయాబ్ధీ!
నాకు దిక్కీవెగా!
శ్రీమద్వేములవాడ మందిరవరా!
శ్రీ రాజరాజేశ్వరా! 100

పరమాత్ముండవటంచు నిన్నెపుడు నే
భావించితిన్ గావునన్
స్థిరపై లోకుల వేచు క్రూరమృగ
జాతిన్ రాజా వేటాడి ప
త్కరుణన్ మర్త్యుల నుద్ధరించు క్రియ నా
కష్టంబులన్ బాపి సు
స్థిరసౌఖ్యంబుల గూర్చి ప్రోవగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 101

కవితాంబోధి తరంగితోజ్వలమృదంగ
ధ్వానసంగీత సం
భవ సంకీర్తన గానకేళి వినుసల
భావించి యెవ్వేళ సం
స్తవమున్జేతు కృతార్థుఁ జేయగదవే.
శంభో. మహాదేవ. శ్రీ
శివ. గౌరీధవ. కేశవార్చిత పదా.
శ్రీ రాజరాజేశ్వరా ! 102

ఓ గంగాధర! ఓ సుధాకరధరా!
ఓ సర్వలోకేశ్వరా!
ఓ గంభీర దయాకరా! శుభకరా!
ఓ భక్త మందార! నా
వాగాడంబరమున్ క్షమించి కృపనన్
పాలింపరావే కప
ర్ధీ! గౌరీహృదయేశ్వరా! హరహరా!
శ్రీ రాజరాజేశ్వరా ! 103

మమతన్ వస్త్రములట్లు నీవు విలస
న్మత్తేభశార్దూల చ
ర్మములన్ దాల్పుటచే ప్రియంబులని నే
మత్తేభ శార్దూల వృ
త్తములన్ భక్తిరచించి యీ శతక
మాస్థన్ నీకు నర్పింతు కూ
రిమితో మత్కృతి స్వీకరింపగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 104

నామంబెన్నగ కేశవుండ నవనిన్
రామాంబికా జానకీ
రామాచార్యుల కగ్రనందనుడ
శ్రీరంగాపురి ధాముడన్
కైమోడ్తున్ భవదీయ పాదములకున్
కామ్యార్థముల్ గూర్పవే!
శ్రీ మద్వేములవాడ మందిరవరా!
శ్రీ రాజరాజేశ్వరా! 105

భవకష్టాబ్ధిఁ దరింపజేయుమని విన్
ప్రార్థించి భక్తాళికిం
పవు రీతిన్ రచియించి యీ శతకమే
నర్పించితిన్ గావునన్
భవదత్యంత కృపాసుధారసము నా
పై జిల్కి రక్షింపవే,
శివ, గౌరీధవ, కేశవార్చిత పదా,
శ్రీ రాజరాజేశ్వరా । 106

ప్రతి పద్యంబును నీదు నామ మకుట ప్రా
ప్తిన్ విరాజిల్ల స
త్కృతి గాకుండునె? తావిగల్గిన సుమం
బే కాదె చెన్నారు మ
త్కృతి యట్లొప్పదె? దీని గైకొనగదే,
ఈశా జగద్రక్షకా,
క్షితి నీనామ మహత్త్వమెన్నవశమే,
శ్రీ రాజరాజేశ్వరా । 107

శ్రీ మన్మంగళ దాయకంబయిన నీ
శ్రీపాదయుగ్మంబు హృ
త్పీఠిన్ వీడక నిల్ప సంతత ముపా
స్తిన్ జేయుచున్నట్టి నా
కామోదంబున కామితార్థము లమే
యస్ఫూర్తి జేకూర్చి సు
క్షేమానుగ్రహధామ! ప్రోవగదవే!
శ్రీ రాజరాజేశ్వరా! 108

కృతి మాకిచ్చి ధనంబుకై నరుల న
ర్థింపంగ నీకెట్లు స
మ్మత మయ్యెన్? కవి సంప్రదాయ మగునా
మాపైని విశ్వాసమే
పతనంబయ్యెన! నీకు కేశవ కవీ!
భద్రంబటంచున్ మదీ
ప్సితమున్ దీర్చుచు మందలించితివిగా
శ్రీ రాజరాజేశ్వరా! 109

చెలరేగెన్ పెనుగాడ్పు కల్పతరు గూ
లెన్ చిత్తశోకాగ్నియున్
జెలరేగెన్ బ్రవహించె బాష్పజలముల్
నేత్రాంబుధుల్ విండి పొం
గుటు గ్రక్కున్ దెగిపారె నే నిలువ లే
కున్నాడ నీవాఁడ, నీ
విలయంబున్ గవినాడ గావగదె నన్
శ్రీ రాజరాజేశ్వరా! 110

ఎదలో దుఃఖదవాగ్ని రేగినది అం
దే విల్పుకొన్నట్టి నీ
పదపద్మంబులు గాలునేమొయని బా
ష్పాంభోనిధుల్ ముంగినన్
మదిలో నగ్ని శమింపదయ్యె వీఁక న
స్మన్మాత కీ వాత్మకాం
తి దయల గూర్చుచు నూరడింపగదె నన్
శ్రీ రాజరాజేశ్వరా! 111

ఏఁ రాలేదిటు విన్నుజూఁడగను ప్ర
త్యేకంబుగా నైన యే
దో రాజ్యాంగపు "టూరు" వెట్టినను యెం
తో ప్రీతితో నీవె నీ
వే రప్పించితి దర్శనంబిడితి నీ
ప్రేమాంత రంగాలయ
శ్రీరాజిల్లుచు మాకు చోటొసఁగుగా
శ్రీరాజరాజేశ్వరా ! 112

నేనెవ్వండనుః నన్ను నేనెరుగఁ ని
న్నే లీల గుర్తించెదన్
నేనెందుండిట వచ్చినాడః నిట నుం
డెందేగనున్నాడః నా
స్థానంబెయ్యది నేనెరుంగనిఁక నీ
స్థానంబు గుర్తించ శం
క్రీ! నాకౌనెః ఎరుంగదెల్పగదవేః
శ్రీరాజరాజేశ్వరా ! 113

పై మీదన్ బుసగొట్టుచున్ భుజగముల్
పారాడినన్‌గాని గం
గోమా భామలు పోరుపెట్టుకొని యెం
తో యుగ్గినంగూడ నీ
వేమాడ్కిన్ దపమాచరించెదొ? క్షణం
బేన్ నిగ్రహంబూనగా
చీమైనన్ జిటుకన్న మాకు వశమా,
శ్రీ రాజరాజేశ్వరా! 114

తెరువింకేది సమస్త వస్తువులు క
ల్తీలయ్యె. ద్రవ్యోల్బణం
బురుదావానలమయ్యె పేదబ్రతుకుల్
హోత్రంబులై పోయె నం
బరమంటన్ ధరలన్నియున్ బెరిగె. జ్ఞా
నక్షోభ జల్లార్చి సు
స్థిరతన్ ధాత్రిఁ సుభిక్ష మేర్పరుపవే,
శ్రీ రాజరాజేశ్వరా! 115

అరెరే! కోట్ల జనమ్ము కూటికొఱకై
అల్లాడుచుండంగ కొం
దరు స్వార్థమ్మున ధాన్యరాసుల కుతం
త్రప్రజ్ఞతో దాచి దు
ర్భరమౌ క్షామదవాగ్ని రేపెదరు స్వా
ర్థ ప్రేతమున్ బాపి యీ
స్థిరపై క్షేమము గూర్చుమో! శుభకరా!
శ్రీ రాజరాజేశ్వరా! 116

అరెరే! మోసముతో అమాయకుల న
న్యాయంబుగా దోచుకొం
దురు లేదూడను జంపి కృత్రిమముగా
దూడన్ దగన్ జేసి ముం
దర జూపెట్టుచు పాలుపిండుకొను చం
దంబయ్యె. స్వార్థప్రియుల్
స్థిరపై రేగిరి చూడవేటికి హరా!
శ్రీ రాజరాజేశ్వరా! 117

అకటా! నేడవినీతి ఖడ్గమున స్వా
ర్థాపేక్షతో సంఘ ఘా
తకియై పేదల గుండియల్ జెనకి ర
క్తాస్వాదియైనట్టి ఘా
తకి పూతాత్మగ మారుటెప్పుడొ కదా।
దావిన్ వేగదండించి ధా
ర్మికమార్గంబునఁ బెట్టుమో। శుభకరా।
శ్రీరాజరాజేశ్వరా। 118

అకటా। కంచెయె చేను మేసె, తిమిర
వ్యాపారపారీణ ఘా
తుక ధూర్తాదిదురాగతోద్ధతులకున్
తోడై ప్రలోభాన ర
క్షకులే భక్షకులైరి కొందరిలలో
శంభో మహాదేవ। ధా
ర్మికలోకంబుల నుద్ధరింపుము ప్రభూ।
శ్రీరాజరాజేశ్వరా। 119

స్వార్థార్థుల్ వరశుల్క కాముకులు దు
ర్వారాపార దుశ్చింతఁ వి
స్వార్థస్వాంత వధూజనంబుల యథేచ్ఛన్
బోచి హింసించ న్యా
యార్థంబై శరణన్నవారి మొర నిం
తైనన్ వినన్రాని నీ
నిర్దాక్షిణ్య మదేల ? ప్రోవుమవనిన్
శ్రీరాజరాజేశ్వరా ! 120

ఒకడంతస్తుల మేడ గట్టుకొన వే
రొక్కండు పూరిల్లు గ
ట్టుకొనంగన్ గతిలేక తా బ్రతుకు నీ
డ్చున్ మంది కొంపల్ల న
ద్దెకు ఆమాత్రము లేక ఇంకొకడు వీ
ధిన్ బండి పొర్లాడు నా
ర్థిక భేదంబులు బాపుమో హరహరా !
శ్రీరాజరాజేశ్వరా ! 121

ఇక నీకేమని విన్నవింతును ప్రభూ ।
ఈ మా సమాజంబు నం
దొక డల్లాడును కూటికోసమయి వే
రొక్కండు తిండెక్కువై
వికట ప్రక్రియ హుంకరించు సమతా
విర్భావ సౌజన్య ల
క్ష్మికి చోటెక్కడ గానుపించదు కదా !
శ్రీరాజరాజేశ్వరా ! 122

ఇలపై దీనుల నుద్ధరింపుము దయా
బ్ధీ ! పాత చింపుళ్ళ గు
డ్డల వాడెవ్వడొ డొక్కలార్చుకొని గుం
టం బడ్డ ఉచ్ఛిష్ట దు
ర్మలినంబౌ కబళంబు కోసమయి పో
రాటంబు సాగించి మ్రు
చ్చిలు చుండెన్ శునకాలతో శివశివా !
శ్రీరాజరాజేశ్వరా ! 123

అకటా ! గద్దెకు గ్రుద్దులాటకు పదవీ
వ్యామోహమా జాతి న
డ్గుకు బట్టించె, సమత్వ భావమది ప
ట్టుం దప్పె, సామాజి కా
ర్థిక భేదంబులు బాధకంబులయి వి
జృంభించె, లోకాల కే
లికవై యింత పరాకు నీకు తగునా !
శ్రీ రాజరాజేశ్వరా ! 124

సకలజ్ఞుండవు నీ వెరుంగవె ప్రపం
చంబందువన్నెద్దు వం
చకు డొక్కొక్కడు గద్దెకెక్కి జన హిం
సాకాండ గావించు ఘా
తుకుడిం కొక్కడ మాయక ప్రజల గొం
తుల్ నొక్కు, లోకాల కే
లికవై ఏల పరాకు సేతువు దొరా !
శ్రీ రాజరాజేశ్వరా ! 125

యుద్ధోన్మాదముతో దురాక్రమణ మొ
క్కాక్కండు సాగించు దు
ర్బుద్ధిన్ లోక వినాశకుండొకడు వాం
ఛల్ సృష్టి గావించు విం
కిద్ధాత్రిన్ సుఖశాంతులన్ నిలుప నీ
దే భారమై యుంట నీ
సిద్ధాంతంబెరిగించి ప్రోవు మవనిన్
శ్రీరాజరాజేశ్వరా ! 126

మూల్లోకంబులనేలు వేల్పువుగదా !
భూలోక మిప్పట్టులన్
కల్లోలంబుల మున్గుచున్న యది సం
గ్రామాంబురాశిస్థలిన్
దెల్లంబేగద నీకు సత్కృప నశాం
తిన్ బాపి లోకంబు వ
ర్ధిల్లన్ జేయుచు సంతరించగదవే !
శ్రీరాజరాజేశ్వరా ! 127

భరతోర్వీతల మాక్రమించుకొన
పై పై భ్రాతృ మిత్రత్వముల్
బరగన్ బల్కుచు పొంచి పొంచి హిమ
శైలంబందు దండెత్తుచున్
నరకన్ బైబడు వంచకాధముల కిన్కన్
ఫాల నేత్రాన చె
చ్చెర వీక్షింపవదేల శత్రు విలయా!
శ్రీరాజరాజేశ్వరా! 128

వృకముల్ మేకల కాపుగాయునటు
లర్థిన్ కొందరీనాడు ర
క్షకులై భక్షకులైన లోకమిది విన్
శంకించు లోకైక ర
క్షక దీవాటనుపేక్షమాని పరి
రక్షాదక్షతన్ జూపి ధా
ర్మిక మార్గ బున బెట్టు మీ కుపథులన్
శ్రీరాజరాజేశ్వరా! 129

మొదటన్ దగ్గర జేరి రాగరవళిన్
ముమ్మారు విన్పించి ఆ
పిదపన్ దద్దులువోవ మేన్గరచుచున్
పీడించు దోమకిర్రియన్
పదమూల్ బట్టి కృతార్థు(డై వ పిదపన్
భస్మాసురుండౌను చే
సెద నీ సేవలు ధూర్తు బారి దొలగన్
శ్రీరాజరాజేశ్వరా ! 130

మాటల్ కోటలు దాటునట్లుగను
డంబాల్ గొట్టి బీద ప్రజా
కోటిన్ స్వర్గ సుఖాల దేల్తుమని
ఉద్ఘోషించి నమ్మించియున్
సీటున్ బొందిన పిమ్మటన్ మరతురేన్
ఛీ అట్టి వాగ్దంభముల్
నీటన్ వ్రాసిన వ్రాలుచందమనరా !
శ్రీరాజరాజేశ్వరా ! 131

కలి భస్మాసురులెందరో కలరు
సాక్షాత్కారమీకూడ దం
చిల గావింపంచవ మాకు? అట్లయిన
స్వామీ! విష్ణురూపాన మా
కెలమిన్ దర్శనమిచ్చి మానవుల యం
దీదైత్యులన్ దూరి రం
జిల శిక్షావన సేయవే! హరి హరా!
శ్రీరాజరాజేశ్వరా! 132

తన దౌర్భాగ్యవశాన పెంటఁబడి
రత్నంబక్కటా! స్వీయ కాం
తిని గోల్పోయి తపించ కోడి విదలించెన్
కాలితో గింజకా
దని తద్దీప్తి దశావిహీనతను
దైన్యంబొంది యోగ్యుండు దా
త్రిని అల్పజ్ఞునిచేత భంగపడుగా!
శ్రీరాజరాజేశ్వరా! 133

స్వామీ! విశ్వ కుటుంబమందొకఁడ
విశ్వ క్షేమమే మామక
క్షేమంబంచు మదిన్ దలంచి భువన
క్షేమార్థ మర్థింతు న
త్యామోదంబున దానిగూర్పవె!
మదీయాభీష్ట మీడేరగన్
శ్రీమద్వేములవాడమందిరవరా!
శ్రీరాజరాజేశ్వరా! 134

భువిలో దావక చారు విగ్రహములన్
పూజార్థమై నాస్తిక
త్వ వినిర్మూలనకై సృజింపుచును వి
శ్వశ్రేయమున్ గూర్చ సం
స్తవనీయుండగు విశ్వకర్మకుల సం
జాతుండనై మంజు కీ
ర్తి విరాజిల్లిన కేశవాఖ్యుడ ప్రభూ
శ్రీరాజరాజేశ్వరా! 135

శ్రీరంగాపురి వాసులౌచు వనప
ర్తిన్ రాజు చెంతన్ సదా
చారోదార పరోపకారులయి వి
శ్వబ్రహ్మ వంశీయులై
ధీరాగ్రేసరులై ధనాఢ్యులయి
ఫోతేదారులై సద్యశ
శ్రీరంజిల్లిరి నాదు పూర్వికులు మున్
శ్రీరాజరాజేశ్వరా ! 136

ఇలలో భోగములెల్ల నమ్ముకొని నే
నేవేళనిన్ భక్తిపై
తలపన్నేరక మోసపోతి, పరమా
త్మా ! నన్ను నీ సత్కృపా
జలధిన్ దేల్చుచు జీవితాంతమున నీ
సాయుజ్యమున్ గూర్చి య
ర్మిలి రక్షింపుము కేశవార్చితపదా !
శ్రీరాజరాజేశ్వరా ! 137

శిరమందున్ శశిపూవుగా వెలయ
నీ శృంగార మేపారగా
నరయన్ గంగ తురాయియై మెరయు
అర్ధాంగం బుమాక్రాంతమై
తరుణీలోక సమత్వభావ మవనిన్
దశోత్త నీ దివ్య మూ
ర్తి రహిల్లన్ గనుపింపవే। గొలచెదన్
శ్రీరాజరాజేశ్వరా। 138

శివుడై కేశవుడై సరోజభవుడై
చిత్తాలయ స్వామియై
స్తవనీయ క్రియలోక పాలన కళా
ధౌరేయుడై క్రాలు వా
డెవడా విశ్వ కుటుంబి వాని నినుగా
భావించి సేవింతు న
చ్చివ మార్గమ్మిదియంచు బ్రోవదగవే
శ్రీరాజరాజేశ్వరా। 139

నా మూర్ధంబు భవవత్పదాబ్జములఁ
నానన్ మోపి ప్రార్థింతునో
స్వామీ! నన్నుఁ గృతార్థుజేయఁ గృపతో
పాలింప వేవేగ రా
వే మార్జాలకిశోర ధర్మమున
సర్వేశా! దయాసాగరా!
శ్రీమద్వేములవాడమందిరవరా!
శ్రీరాజరాజేశ్వరా! 140

శ్రీమనున్మంగళదాయకంబయి జగత్
శ్రేయప్రదంబై శ్రిత
క్షేమానుగ్రహధామమై వెలయు నీ
శ్రీపాదముల్ నమ్మితిన్
స్వామీ! నన్ను గృతార్థుఁజేసి వరముల్
ప్రాప్తింపగా జేయవే!
శ్రీమద్వేములవాడమందిరవరా
శ్రీరాజరాజేశ్వరా! 141

మంగళమ్ మహత్ శ్రీ శ్రీ శ్రీ

ఈ కవి ఇతర కృతులు

ముద్రితం

1. శ్రీ రామలింగేశ్వర నక్షత్రమాల
2. అమరస్మృతులు (ఖండకావ్యం) రు. 7-00
3. శ్రీ సీతారామ తారావళి రు. 5-00
4. శ్రీరాజరాజేశ్వర శతకము రు. 2-00
5. బుద్ధ చరితము (గోలకొండ పత్రికలో ముద్రితం)

అముద్రితం

1. శ్రీరంగశతకము
2. మాతృశ్రీ
3. గేయకథలు
4. భద్రగిరి శతకము
5. పర్ణశాల (గేయకావ్యం)
6. గణాంకదర్శిని
7. దైవదండన
8. The Economic History of ancient Andhra



1962 లో

గ్రంథకర్త
'రసప్రియ'
ఫోతేదార్ కేశవాచార్య

జన్మస్థలం:- శ్రీరంగాపురం. వనపర్తి తాలూకా. మహబూబ్ నగర్ జిల్లా,

అభ్యస్థ విద్యలు :- ఆర్థిక శాస్త్రంలో పట్టభద్రులు, ఆంధ్రాంగ్ల ఉర్దూ హిందీ భాషలలో పరిచయ పాండిత్యములు.

అభిరుచులు :- చిత్రలేఖనం, చరిత్రపరిశోధన, తత్వశాస్త్రం

వ్యాసంగములు:- సాంఘికార్థిక ప్రణాళికా గణాంక సమీక్షలు. క్షేత్రచారిత్రక రచనలు.

అభినందనాశీర్వాదములు

కవిసింహ కాశీపత్యవధానిగారు

చారుపదాంచితంబునయి శ్రావ్యమునై రసవత్తరంబునై
సూరిమనోహరంబునయి శుంభదలంకరణాన్వితంబునై
భూరి సలక్షణంబునయి పొల్చెడు కైతగలట్టి కేశవా
చారికి చెల్లునంచును 'రసప్రియ' యన్ బిరుదంబొసంగితిన్!

సాహిత్యస్థాపక, కవివీర, రా. సు. రాట్కవిగారు

నీవు రసప్రియుండ వవనిన్ రసవంతములై ప్రసన్నమై
చేవగలట్టి సత్కృతులచే విలసిల్లుచునుంటి వీవు శి
ష్యావళిలోన నగ్రజుఁడవంచు దలంచుచునుందు నిన్ను. సీ
తా విభుఁడిచ్చు గాత బ్రఁ మదంబుగ నీకుఁ జిరాయురున్నతుల్!

జగజ్జనని వేదాంత కవిగారు

నామములెన్నియో గలవు నాటికి నేటికి వాటిలోన నీ
నామము శ్రేష్ఠమై మొదటి నామముగా విలసిల్లె కేశవా!
నీ మధుర ప్రసన్న కమనీయ కళాకవనమ్ముగూడ భా
షామణి చల్వతో నెగడి శాశ్వతమై పొగడించు ధాత్రిపై!

ఆంధ్రమిల్టన్ శతావధాని డోకూరికోట్ల బాలబ్రహ్మాచార్యులుగారు

అర్థిజనంబుగోరిన సహాయము శక్తిఁ గొలందిసల్పు ని
స్స్వార్థపరుండు సాధుహిత బంధురతుండయి యెన్నడేనియున్
వ్యర్థులజోలికిన్ జనక పండితమైత్రినెసంగి కేశవుం
డర్థ గణాంకశాఖ నహహా! అధికారమునంది వర్ధిలెన్!

విద్వత్కవిరత్న పెదపాటి నాగేశ్వరరావు M. A. గారు

గద్వాలాహ్వాయ దివ్యభవ్యకవితా కల్లోలినీ సీమసు
విద్యాభ్యాసవశేన–పండితసభా వ్యాజవాత్సల్యతః
సౌశీల్యేనచ పూర్వపుణ్యవశతః సంపాదితం సంస్కృతమ్
యుష్మత్ తెల్గుకవిత్వ సత్వరచనా భోగస్సదా జీయతాత్॥

ఫోతేదారుకులోద్భవ–కేశవనామక మిత్రః
శ్రీశకృపాశిషవృద్ధ్యా–వర్ధతు వర్ధతు నిత్యమ్॥

కవిశేఖర, కె. కోదండరామాచార్య M.A. M.O.L. గారు

రసప్రియేణ నామ్నాచ–గ్రంధరచనాం కరోతియః
సఏవ కేశవాచార్యః–కవితా రసికప్రియః॥

గణాంకశాఖే వృత్తిశ్చ–రక్తిస్సాహిత్య సౌరభే
హరిస్మరణ శీలశ్చ–కేశవార్యో భవత్తదా॥

శ్రీమాన్ కేశవనామాత్యః–కవితాతస్య పుత్రికా
భగవత్కృప యాశశ్వత్–జీయాదా చంద్రతారకం॥

కవిభూషణ శ్రీ యత్రం విశ్వనాథంగుప్తగారు

చక్కని చిక్కని కయితల-పెక్కుల రచియించినావు పెద్దలు మెచ్చన్
నిక్కముగ మీ కవిత్వము-చక్కెర తేనియలకన్న చవిగలది సఖా!

"అభినవధూర్జటి"యని మి-మ్మభినందించెదను కేశవాచార్యకవీ!
అభవుండనుగ్రహించుత-శుభసౌఖ్యశ్రీల మీకు శోభిలసుకవీ!

నలువసతి గళమునందున-విలువగు మణిహారములను వేయగ నింకన్
నలువుము సొంపగు కవితల-నిలుపుము మీ వంశకీర్తి నిచ్చలు సుకవీ!



కొలువై నీ వెసగన్ సతీసుతులతో గూర్చుండియున్నప్పుడిం
పలరన్ గోవరసింహమూషకశిఖివ్యాళంబులున్ మీ కడన్
జెలిమిన్ వర్తిలజేసినట్లు జనులన్ స్నేహంబునన్ ధాత్రి వ
ర్తిలఁజేయంగదె కేశవార్చిత పదా! శ్రీ రాజరాజేశ్వరా!

రసప్రియ